

9న జడ్పీ సర్వసభ్య సమావేశం

విశాఖపట్నం, జూలై 7 (ఆంధ్రజ్యోతి):

జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని చైర్‌పర్సన్ అధ్యక్షతన ఈ నెల తొమ్మిదో తేదీన జడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తిచేశామని ముఖ్య కార్యనిర్వహణాధికారి పి.నారాయణమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని, జిల్లా ప్రాదేశిక నియోజకవర్గ సభ్యులు, ఎంపీపీలు, అధికారులు అందరూ హాజరు కావాలని ఆయన కోరారు.

బీఎన్ రోడ్డు దుస్థితిపై కోర్టులో కేసు

జిల్లా కలెక్టర్, ఆర్డీవో సహా ఏడుగురు ప్రభుత్వ అధికారులకు నోటీసులు జారీ

26న కోర్టు ముందు హాజరుకావాలని ఆదేశం

- పబ్లిక్ ఇంట్రస్ట్ పిల్‌ను దాఖలు చేసిన న్యాయవాదులు

చోడవరం, జూలై 7 (ఆంధ్రజ్యోతి):

జిల్లాలోని బీఎన్ (భీమిలి-నర్సీపట్నం) రోడ్డు దుస్థితిపై కలెక్టర్ సహా ఏడుగురు ప్రభుత్వ అధికారులకు లీగల్‌సెల్ అథారిటీ చైర్మన్, తొమ్మిదో అదనపు కోర్టు న్యాయాధికారి నోటీసులు జారీచేశారు. చోడవరం, మాడుగుల నియోజకవర్గాలతో పాటు, అల్లూరి జిల్లా ప్రజలకు కీలకమైన బీఎన్ రోడ్డు మరమ్మతులు చేపట్టడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికార యంత్రాంగంపై లీగల్ సెల్‌లో బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు కాండ్రేగుల డేవిడ్ ఆధ్వర్యంలో మరో ఇద్దరు న్యాయవాదులు భరత్‌భూషణ్, భూపతి రాజులు పబ్లిక్ ఇంట్రస్ట్ పిల్‌ను దాఖలు చేశారు. న్యాయవాదుల పిటిషన్‌పై స్పందించిన లీగల్ సెల్ అథారిటీ చైర్మన్, తొమ్మిదో అదనపు కోర్టు న్యాయాధికారి ఎ.రతన్‌కుమార్... రహదారుల పరిస్థితికి బాధ్యులైన అధికారులు ఈనెల 26న కోర్టు ముందు హాజరుకావాలని నోటీసులు జారీ చేసినట్టు న్యాయవాది కాండ్రేగుల డేవిడ్ సోమవారం ఉదయం విలేకరులకు వెల్లడించారు.

జిల్లాలోని గ్రామీణ ప్రాంతంలో ప్రధానమైన చోడవరం బీఎన్ రోడ్డుతో పాటు, మాడుగుల రోడ్డు నిర్వహణను గత 20 ఏళ్లుగా పట్టించుకోకపోవడం వల్ల ప్రజలు ప్రమాదాల పాలవుతున్నారని, వాహనాల యజమానులు ఆర్థికంగా నష్టపోతున్నారన్న విషయాన్ని తమ పిటిషన్‌లో కోర్టు ముందుంచామన్నారు. ఈ రోడ్డు వల్ల విద్యార్థులు, ఉద్యోగులు, అనారోగ్యంతో బాధపడుతున్నవారు... ఇలా అన్నివర్గాల వారు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నందున సెక్షన్ 12, 13 ప్రకారం లీగల్‌సెల్ కోర్టులో కేసు దాఖలు ... మిగతా 8వ పేజీలో





అధ్వానంగా బీఎన్ రోడ్డు (ఇన్‌సెట్‌లో) కోర్టు వద్ద వివరాలు వెల్లడిస్తున్న న్యాయవాది డేవిడ్

అధ్వానంగా బీఎన్ రోడ్డు...

జిల్లాలో ప్రధానమైన బీఎన్ రోడ్డు చాలాకాలంగా మరమ్మతులు లేకపోవడంతో శిధిలావస్థకు చేరింది. చోడవరం మండలం గంధవరం నుంచి నర్సీపట్నం వరకూ, బుచ్చెయ్యపేట మండలం వడ్డాది నుంచి మాడుగుల మండలం తాటిపర్తి వరకూ రహదారి అభివృద్ధికి ఐదేళ్ల క్రితం న్యూడెవలప్‌మెంట్ బ్యాంకు (ఎన్‌డీబీ) నిధులు రూ.119 కోట్లు మంజూరయ్యాయి. వైసీపీ ప్రభుత్వం టెండర్లు పిలిచి పనులు కాంట్రాక్టర్‌కు అప్పగించింది. అయితే బిల్లులు చెల్లించడంలో జాప్యం చేయడంతో కాంట్రాక్టర్ అర్ధంతరంగా పనులు నిలిపివేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కూడా పనుల్లో పురోగతి లేదు. పనులు ప్రారంభించాలని కాంట్రాక్టర్‌ను అనకాపల్లి ఎంపీ, చోడవరం, మాడుగుల ఎమ్మెల్యేలు కోరినప్పటికీ స్పందన కరువైంది. ఈ రోడ్డు విషయంలో ఆర్అండ్‌బీ అధికారులు కూడా చేతులెత్తేశారు. ఇప్పటికే అధ్వానంగా తయారైన ఈ రహదారి ఇటీవల కురిసిన వర్షాలకు మరింత దారుణంగా, ప్రమాదకరంగా మారింది. ఈ మార్గంలో అటు విశాఖ, ఇటు అనకాపల్లి, అల్లూరి జిల్లాల నుంచి నిత్యం వేలాది మంది రాకపోకలు సాగిస్తుంటారు. రహదారి మొత్తం ధ్వంసమై వర్షం పడితే చెరువును తలపిస్తోంది. ఈ క్రమంలో అనేకమంది వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. కనీసం గుంతలు కూడా కప్పకపోవడంతో పరిస్థితి మరింత దయనీయంగా తయారైంది.

కోనాం వైపు కన్నెత్తి చూడరే?

నిర్లక్ష్యానికి గురవుతున్న జలాశయం

- గత వైసీపీ పాలనలో పట్టించుకోలేదు
- గేట్లకు అమర్చిన రబ్బరు తొడుగులు పని చేయని వైనం
- రోజూ 50 క్యూసెక్కుల నీరు వృథా
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు

చీడికాడ, జూలై 7(ఆంధ్రజ్యోతి):

మండలంలోని కోనాం జలాశయం నిర్లక్ష్యానికి గురవుతోంది. పదేళ్ల కిందట నుంచి సమస్యలు వేధిస్తున్నా గత వైసీపీ పాలనలో జలాశయాన్ని పట్టించుకోకపోవడంతో పరిస్థితి దారుణంగా తయారైంది. బలహీన పడిన గట్టు, శిథిలమైన సిబ్బంది గృహాలు, రిజర్వాయర్‌కు వెళ్లే మార్గం అధ్వానంగా ఉన్నా కనీసం పట్టించుకున్న పాపాన పోలేదు. దీంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



జలాశయం గట్టు లోపల పేరుకుపోయిన తుప్పలు



కోనాం జలాశయం ప్రవేశ ద్వారం



దిగువ కాలువ ద్వారా వృథాగా పోతున్న నీరు

మండలంలోని కోనాంలో వేచలపు పాలవెల్లి జలాశయాన్ని 45 ఏళ్ల క్రితం నిర్మించారు. తొలి ముప్పై సంవత్సరాలు నిర్వహణ బాగానే ఉన్నా ఆ తరువాత పదేళ్లుగా సమస్యలు వేధిస్తున్నాయి. పదేళ్ల కిందట విద్యుత్ బకాయిలు పేరుకుపోవడంతో విద్యుత్ శాఖ అధికారులు విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. అప్పటి నుంచి వర్షాకాలంలో మూడు నెలలు, నీటి మట్టం గరిష్ఠ స్థాయికి చేరినప్పుడు జనరేటర్‌ను ఉపయోగిస్తున్నారు. ఈ రిజర్వాయర్ ఎగువ కాలువ కింద సుమారు మూడు వేల ఎకరాలు, దిగువ కాలువ కింద 11,500 ఎకరాల సాగు భూములు ఉన్నాయి. వాస్తవానికి రిజర్వాయర్ వద్ద విధులు నిర్వహించేందుకు నలుగురు లస్కర్లు, ఒక ఆపరేటర్, ఇద్దరు హెల్పర్‌లు, ఇద్దరు హెడ్ మజ్దూర్‌లు, ఒక ఏఈ ఉండాలి. కానీ ప్రస్తుతం వాచ్‌మన్, ఏఈ మాత్రమే ఉన్నారు. సిబ్బంది ఉండేందుకు నిర్మించిన క్వార్టర్లు శిథిలావస్థలో ఉన్నాయి. గత్యంతరం లేక వాచ్‌మన్ అందులోనే నివాసముంటున్నాడు. ఇక జలాశయం పరిశీలనకు వచ్చే అధికారుల కోసం ఇరవై ఏళ్ల క్రితం నిర్మించిన విశ్రాంతి భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరింది.

రోజూ 50 క్యూసెక్కుల నీరు వృథా

జలాశయం గరిష్ఠ స్థాయి నీటిమట్టం 101.25 మీటర్లుగా అధికారులు నిర్ణయించారు. అయితే 92 మీటర్లు స్థాయికి వచ్చేసరికి ఎగువ కాలువ ద్వారా సాగునీరు నిలిపివేస్తున్నారు. అలాగే 87 మీటర్లు వచ్చేసరికి దిగువ కాలువ సాగునీరు నిలిపివేస్తున్నారు. 14,500 ఎకరాలకు ... మిగతా 8వ పేజీలో

10న మెగా పీటీఎం

- జిల్లాలో 1,955 పాఠశాలలు, 134 జూనియర్ కళాశాలలు
- హాజరుకానున్న 2.11 లక్షల మంది విద్యార్థులు, 1.37 లక్షల మంది తల్లిదండ్రులు

నక్కపల్లి, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ఏడాది కాలంగా విద్యా వ్యవస్థలో ఎన్నో మార్పులు చోటుచేసుకుంటున్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక గత ఏడాది తొలిసారి మెగా పీటీఎం (మెగా పేరెంట్, టీచర్స్ మీట్) జరిగింది. దీనికి అనూహ్య స్పందన రావడంతో ఈ నెల 10న మెగా పీటీఎం 2.0 కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టనుంది. జిల్లా వ్యాప్తంగా విద్యార్థుల తల్లిదండ్రులు అన్ని ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్ పాఠశాలలు, కళాశాలల్లో మెగా పీటీఎం సమావేశాలు నిర్వహించనున్నారు. జిల్లా వ్యాప్తంగా 1.37 లక్షల మంది తల్లిదండ్రులు ఈ కార్యక్రమానికి హాజరుకానున్నారు. జిల్లాలో 1,955 ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలలు, 134 ప్రైవేట్, ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉన్నాయి.

ఉదయం నుంచి సాయంత్రం వరకూ...

ఈ నెల 10వ తేదీన అన్ని ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలల్లో నిర్వహించే మెగా పీటీఎం 2.0 నిర్వహణపై ఇప్పటికే విద్యాశాఖ స్పష్టమైన మార్గదర్శకాలను జారీ చేసింది. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ ఈ కార్యక్రమం జరుగుతుంది. విద్యార్థుల ప్రతిభా, సామర్థ్యంతో కూడిన ప్రోగెస్ కార్డులను కూడా అందజేస్తారు. విద్యార్థి మిత్ర, తల్లికి వందనం, మధ్యాహ్న భోజనం, పిల్లల సామర్థ్యం, పాఠశాలల్లో వున్న సదుపాయాలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనుల గురించి చర్చించి తీర్మానం చేస్తారు. ఈ కార్యక్రమంలో 2.11 లక్షల మంది విద్యార్థులు. 1.37 లక్షల మంది తల్లిదండ్రులు పాల్గొంటారు.

ప్రధానోపాధ్యాయుడి ఉదారత

- సొంత ఖర్చులతో విద్యార్థులకు ఆటో ఏర్పాటు



విద్యార్థుల రాకపోకలకు ఆటో ఏర్పాటు చేసిన ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు

కశింకోట, జూలై 7 (ఆంధ్రజ్యోతి):

తాళ్లపాలెం నంబర్ -3 ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను గత విద్యా సంవత్సరంలో మూసి వేశారు. ఆ విద్యార్థులను బంగారయ్యపేట నంబరు -1 పాఠశాలలో చేర్పించారు. తాళ్లపాలెం నుంచి బంగారయ్యపేట స్కూల్‌కు సుమారు నాలుగు కిలోమీటర్ల దూరం ఉండడంతో 1 నుంచి 5వ తరగతి విద్యార్థులు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయం తెలిసి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గాడి శ్రీనివాసరావు వారి కోసం సొంత ఖర్చులతో ఆటో ఏర్పాటు చేశారు. ఆటోకు ఆయన నెలకు రూ.1500 చెల్లిస్తున్నారు. ఆయనకు విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానికులు అభినందనలు తెలిపారు.

పురాతన భవనంలో బిక్కుబిక్కుమంటూ విధులు

శిథిలావస్థలో ఆర్అండ్‌బీ కార్యాలయ భవనం

- ఇప్పటికీ బ్రిటిష్ కాలం నాటి ఫర్నిచర్ వినియోగం
- భవనం పైకప్పునకు రంధ్రం పడడంతో వానొస్తే తడిసిపోతున్న గదులు
- ఫైళ్లపై ప్లాస్టిక్ కవర్లు కప్పాల్సిన దుస్థితి
- సిబ్బందికి తప్పని ఇబ్బందులు
- ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపినా స్పందించని వైనం



నర్సీపట్నం ఆర్అండ్‌బీ డివిజనల్ కార్యాలయం



కార్యాలయంలో పైకప్పునకు పడిన రంధ్రం(వృత్తంలో)

నర్సీపట్నం, జూలై 7(ఆంధ్రజ్యోతి):

బ్రిటిష్ కాలం నాటి శిథిల భవనం.. పురాతన చెక్క బీరువాలు, కుర్చీలు, టేబుళ్లు. భవనం పైకప్పు రంధ్రం పడడంతో వానొస్తే తడిసిపోతున్న గదులు. విధుల నిర్వహణలో సిబ్బం దికి ఇబ్బందులు.. ఇదీ నర్సీపట్నం ఆర్అండ్‌బీ కార్యాలయ దుస్థితి.

బ్రిటీష్ కాలం నాటి భవనంలో ఆర్అండ్‌బీ కార్యాలయాన్ని నిర్వహిస్తున్నారు. డీఈఈ, నర్సీపట్నం, పెదబొడ్డేపల్లి, కృష్ణాదేవి ఏఈలు, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు విధులు నిర్వహిస్తున్నారు. పురాతన భవనం కావడంతో పైకప్పునకు రంధ్రం పడడంతో వర్షం పడినప్పుడు నీరు లీకై గదులు చిన్నపాటి చెరువులా తయారవుతున్నాయి. గోడలు నానిపోయి ముఖ్యమైన ఫైళ్లకు రక్షణ లేకుండాపోయింది. కార్యాలయంలో రికార్డులు పెట్టుకోవడానికి అల్మారాలు, భద్రపరుచుకోవడానికి బీరువాలు ... మిగతా 8వ పేజీలో



వర్షపు నీరు కారితే ఫైళ్లు తడిసిపోకుండా ప్లాస్టిక్ కవర్లు కప్పిన దృశ్యం


సంపద కేంద్రాలకు పునరుజ్జీవం

520 కేంద్రాలను వినియోగంలోకి తేవాలని కూటమి ప్రభుత్వం నిర్ణయం

- గత వైసీపీ ప్రభుత్వంలో నిర్లక్ష్యానికి గురైన వాటికి మోక్షం

(అనకాపల్లి- ఆంధ్రజ్యోతి)

గ్రామీణ ప్రాంతాల ఆర్థిక వృద్ధిపై ప్రభుత్వం దృష్టి పెట్టింది. దీనిలో భాగంగా గత వైసీపీ ప్రభుత్వ పాలనలో నిర్వీర్యమైన సంపద సృష్టి కేంద్రాలను మళ్లీ గాడిలో పెట్టాలని నిర్ణయించింది. జిల్లాలో వృథాగా ఉన్న అన్ని సంపద సృష్టి కేంద్రాలను అందుబాటులోకి తెచ్చేందుకు చర్యలు చేపట్టింది. 2014-19 మధ్య కాలంలో అప్పటి టీడీపీ ప్రభుత్వం చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రాల పేరుతో వర్మీ కంపోస్టు యూనిట్లను రూ.లక్షలు వ్యయం చేసి నిర్మించింది. అయితే గత వైసీపీ ప్రభుత్వం వీటిని పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. దీంతో ఇవి వృథాగా పడి ఉన్నాయి. కాగా కూటమి ప్రభుత్వం జిల్లాలో వృథాగా ఉన్న 450 కేంద్రాలు, అప్పట్లో అరకొర నిర్మాణాలతో నిలిచిపోయిన 70కి పైగా కేంద్రాలను వినియోగంలోకి తేవాలని నిర్ణయించింది. ఇప్పటికే జిల్లాలో పలు మండలాల్లో పాత కేంద్రాలకు మరమ్మతు పనులు చేపడుతుండగా, 22 కొత్త కేంద్రాల నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ప్రతి మంగళ, బుధ, గురువారాల్లో మండల అభివృద్ధి అధికారులు, గ్రామ పంచాయతీ సిబ్బంది చెత్త సంపద సృష్టి కేంద్రాలను సందర్శించాలని ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది.



అచ్యుతాపురంలోని వైఎస్సార్ నగర్‌లో నిర్మిస్తున్న సంపద కేంద్రం

త్వరలో వినియోగంలోకి సంపద కేంద్రాలు

జిల్లాలో చెత్త నుంచి సంపద కేంద్రాలను వినియోగంలోకి తెచ్చేందుకు చర్యలు చేపడుతున్నామని చెత్త నుంచి సంపద కేంద్రాల జిల్లా సమన్వయకర్త నాగలక్ష్మి తెలిపారు. వృథాగా ఉన్న కేంద్రాలకు మరమ్మతులు చేపట్టడం, లేని చోట కొత్తవి నిర్మించడం వంటి పనులు గ్రామ పంచాయతీలు చేస్తున్నాయన్నారు.

20 లక్షల ఉద్యోగాలు ఇవ్వడమే లక్ష్యం



మంత్రి పార్థసారథిని సన్మానిస్తున్న దృశ్యం

మాడుగుల టీటీడీ కల్యాణ మండపంలో సోమవారం నిర్వహించిన డీసీసీబీ రుణాల పంపిణీ కార్యక్రమంలో మంత్రి కొలుసు పార్థసారథి ముఖ్య అతిథిగా మాట్లాడుతూ ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు అందించడమే సీఎం చంద్రబాబు లక్ష్యమని తెలిపారు. అనంతరం ఆయనను ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, బత్తుల తాతయ్యబాబు, కోన తాతారావు, తదితరులు సన్మానించారు. - వార్త 8వ పేజీలో..

చికాకు పెట్టే అలర్జీలు

శారీరకంగా ఎన్నో ఇబ్బందులు

- గాలి, ఆహారం, డ్రగ్స్ తదితర కారణాలు
- కాలుష్యంతోనూ తీవ్రమయ్యే సమస్య

నేడు అంతర్జాతీయ అలర్జీ డే

- 8వ పేజీలో



అర్హులందరికీ సంక్షేమ పథకాలు : మంత్రి అనిత



నక్కపల్లి : దేవవరంలో సుపరిపాలనలో తొలి అడుగు కరపత్రాలు అందజేస్తున్న మంత్రి వంగలపూడి అనిత



పాయకరావుపేట రూరల్: అరట్లకోటలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో సంక్షేమ పథకాలు వివరిస్తున్న టీడీపీ నాయకులు



మునగపాక: నారాయుడుపాలెంలో సుపరిపాలన తొలిఅడుగుపై ప్రచారం చేస్తున్న టీడీపీ శ్రేణులు

నక్కపల్లి, జూలై 7 (ఆంధ్రజ్యోతి): తమ ప్రభుత్వ పాలనలో రాజకీయాల కతీతంగా అర్హులైన అందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. మండలంలోని దేవవరంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా హోం మంత్రి వంగలపూడి అనిత గ్రామస్థులతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన సభలో ఆమె మాట్లాడుతూ వైసీపీ పాలనలో రాష్ట్రం అధోగతి పాలైందని, కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టిందన్నారు. నియోజకవర్గానికి అనేక పరిశ్రమలు వస్తున్నందున లక్షమందికి ఉద్యోగావకాశాలు లభిస్తాయని చెప్పారు. దేవవరానికి చెందిన మాజీ ఎంపీపీ దేవర సత్యనారాయణను పాయకరావుపేట ఏఎంసీ చైర్మన్‌గా నియమించామన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో నిర్మించిన అంగన్‌వాడీ భవనాన్ని ఆమె ప్రారంభించారు. గర్భిణులకు సీమంతం చేశారు. మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఏడాది పాలనలో ప్రభుత్వం అమలుచేసిన సంక్షేమ పథకాలు,అభివృద్ధి గురించి కరపత్రాలను పంపిణీ చేశారు. ఆమె వెంట టీడీపీ నియోజకవర్గ కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేశ్, టీడీపీ మండల అధ్యక్షుడు గింజాల లక్ష్మణరావు, నాయకులు కురందాసు నూకరాజు, చించలపు పద్దు, అబద్దం, వైబోయిన రమణ, కొప్పిశెట్టి బుజ్జి, కొరిమి సూర్య గణేశ్, గోసల చిన తాతారావు, చిరంజీవి, త్రిపురాల రాము తదితరులు పాల్గొన్నారు.

పాయకరావుపేట రూరల్‌లో..

కూటమి ప్రభుత్వంలో అర్హులందరకీ సంక్షేమ పథకాలు అందిస్తున్నట్టు టీడీపీ సీనియర్ నాయకుడు పెదిరెడ్డి చిట్టిబాబు అన్నారు. మండలంలోని అరట్లకోటలో సోమవారం టీడీపీ నాయకుడు కట్టా శ్రీను ఆధ్వర్యంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. టీడీపీ నాయకులు జూరెడ్డి ప్రసాద్, చింతకాయల రాంబాబు, శ్రీరాంపురం సర్పంచ్ గారా కృష్ణప్రసాద్, దువ్వ శ్రీనివాస్ పాల్గొన్నారు.



అచ్యుతాపురం రూరల్: చీమలాపల్లిలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్న టీడీపీ నాయకులు

మునగపాకలో..

వైసీపీ పాలనలో నిర్మాణరంగం నిర్వీర్యం అయ్యిందని గవర కార్పొరేషన్ డైరెక్టర్ బీమరశెట్టి శ్రీనువాసరావు తెలిపారు. మండలంలో నారాయుడుపాలెంలో సోమవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగాఆ ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల గురించి వివరించారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు పెంటకోట విజయ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ డొక్కా నాగభూషణం, మాజీ ఎంపీపీ ఆడారి మంజు, క్లస్టర్ ఇన్‌చార్జి సబ్బి శ్రీను, దాడి శ్రీను, ఎంవీఆర్.నాయుడు, దాడి జగన్ తదితరులు పాల్గొన్నారు.

అచ్యుతాపురం రూరల్‌లో..

మండంలలోని చీమలాపల్లిలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని తెలుగుదేశం పార్టీ నాయకులు సోమవారం నిర్వహించారు. టీడీపీ మండల అధ్యక్షుడు పీలా తులసీరామ్ ఆధ్వర్యంలో ఇంటింటికీ తిరిగి కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మామిడి శివ అప్పారావు, పతివాడ చిన్నయ్యనాయుడు, కాండ్రేగుల అప్పారావు, గిరి పాల్గొన్నారు.

మెగా పీటీఎం విజయవంతం చేయాలి

నక్కపల్లి, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ఈ నెల10న మండలంలోని అన్ని పాఠశాలల్లో నిర్వహించనున్న మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశాన్ని (పీటీఎం) విజయవంతంగా నిర్వహించాలని తహసీల్దార్ నర్సింహమూర్తి పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల ప్రత్యేకాధికారి విజయ ఆధ్వర్యంలో నిర్వహించిన హెచ్‌ఎంల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టే ఈ కార్యక్రమంలో తల్లిదండ్రులను భాగస్వామ్యం చేయాలన్నారు. ఎంఈవో కె.నరేశ్ మెగా పీటీఎం సమావేశాల గురించి తెలియజేశారు. సీనియర్ హెచ్‌ఎం వేమగిరి నూకరాజు ఉపాధ్యాయుల సందేహాలను నివృత్తి చేశారు.

పునరావాస కాలనీ గ్రీన్‌బెల్ట్‌లో ఇళ్ల స్థలాలు కేటాయించవద్దు

అచ్యుతాపురం, జూలై 7 (ఆంధ్రజ్యోతి): సెజ్ పునరావాస కాలనీ గ్రీన్‌బెల్ట్ పరిధిలో ఇతరులకు ఇళ్ల స్థలాలు కేటాయించవద్దని కాలనీ వాసులు సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశారు. రాంబిల్లి, అచ్యుతాపురం మండలాలకు చెందిన 24 గ్రామాల సెజ్ నిర్వాసితులకు దిబ్బపాలెం వద్ద 458 ఎకరాల్లో పునరావాసం కాలనీ ఏర్పాటు చేశారని, ఈ కాలనీ చుట్టు వివిధ కర్మాగారాలుండడంతో కాలుష్య నివారణకు కొంత స్థలంలో భారీగా చెట్లు పెంచారన్నారు. ప్రస్తుతం ఏపుగా పెరిగిన చెట్లను నరికి చదును చేస్తున్నారని, గ్రీన్‌బెల్ట్‌ని నాశనం చేయకుండా కృష్ణంపాలెం నిర్వాసితులకు వేరే స్థలం కేటాయించాలని వారు వినతిపత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో వియ్యపు కృష్ణ, గాడి గణేష్, జె. శ్రీనివాసరావు పాల్గొన్నారు.

శ్రీరాంపురంలో పారిశుధ్య పనులు

పాయకరావుపేట రూరల్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీరాంపురంలో సోమవారం పారిశుధ్య పనులను చేపట్టారు. గ్రామంలోని వీధులలోని రోడ్లపై ఉన్న చెత్తా, చెదారాలను తొలగించించినట్టు డిప్యూటీ ఎంపీడీవో డేవిడ్ తెలిపారు. గ్రామాలలో పారిశుధ్య లోపం లేకుండా చూడాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వైవీ సత్యనారాయణ పాల్గొన్నారు.

గజిరెడ్డిపాలెంలో లోఓల్టేజీ సమస్యను పరిష్కరించాలి

రాంబిల్లి, జూలై 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జడ్.చింతువా పంచాయతీ గజిరెడ్డిపాలెంలో నెలకొన్న లోఓల్టేజీ సమస్యను పరిష్కరించాలని గ్రామానికి చెందిన చేపల చిట్టిబాబు సోమవారం కలెక్టరేట్ కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అధికారులకు వినతిపత్రాన్ని అందజేశారు. తమ గ్రామంలో వీధి దీపాలు రాత్రి, పగలు తేడా లేకుండా వెలిగే ఉంటున్నాయని, దీంతో గ్రామంలో లోఓల్టేజీ సమస్య అధికంగా ఉంటుందన్నారు. విద్యుత్‌ను ఆదా చేసుకోవాలని అధికారులు మాటలు చెపుతున్నారే తప్ప ఆచరణ చేయడం లేదన్నారు. గ్రామంలో వేసిన విద్యుత్ వైర్లు తరచూ తెగిపోతున్నాయని, దీని వలన ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, కొత్తవైర్లు వేసేలా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్‌ను కోరినట్టు చిట్టిబాబు తెలిపారు.

మొదలైన అన్నదాత సుఖీభవ నమోదు

మునగపాక, జూలై 7 (ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ నమోదు ప్రక్రియ తిరిగి మొదలైనందున వినియోగించుకోవాలని రైతు సేవా సహాయకురాలు సింధు తెలిపారు. నమోదు చేసుకోని రైతులు పస్‌బి, ఆధార్ జెరాక్స్‌తో రైతు సేవా కేంద్రానికి రావాలన్నారు.

రోగులతో కోటవురట్ల ఆస్పత్రి కిటకిట

- ఓపీ 250 పైమాటే..
- డాక్టర్ల కొరతతో తప్పని నిరీక్షణ

కోటవురట్ల, జూలై 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక వైద్య విధాన పరిషత్ ఆస్పత్రి (సీహెచ్‌సీ) రోగులతో కిటకిటలాడుతోంది. గత వారం రోజులుగా రోజుకి 250 మంది వరకు ఓపీ వైద్య సేవలు పొందుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు పల్లెల్లో జ్వరాలు విజృంభించాయి. దీంతో పలు గ్రామాలకు చెందిన రోగులు సీహెచ్‌సీకి వచ్చి వైద్య సేవలు పొందుతున్నారు. అయితే ఆస్పత్రిలో వైద్యుల కొరత ఉండడంతో రోగులు గంటల కొలది క్యూలో ఉండాల్సి వస్తున్నది. ఈ ఆస్పత్రిలో రెగ్యులర్ డాక్టర్ ఒక్కరే ఉండగా.. ఇతర ఆస్పత్రుల నుంచి రోజుకొకరు డిప్యూటేషన్‌పై వస్తున్నారు. ఆస్పత్రిలో ఔట్‌పేషెంట్ రోగులు రోజుకి 250 మందికి తక్కువగా రావడం లేదు. ఇన్‌పేషెంట్ రోగులు రోజుకి 40 నుంచి 50 వరకు ఉంటున్నారు. సోమవారం ఆస్పత్రికి 310 మంది ఓపీ రాగా, వారిలో ఎక్కువగా జ్వర బాధితులు ఉన్నారు. యండపల్లి, బీకేపల్లితో పాటు పలు గ్రామాల్లో జ్వరాలు ఎక్కువగా ఉండడంతో ఆర్థిక స్థోమత ఉన్నవారు నర్సీపట్నంలోని ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లి వైద్య సేవలు పొందుతున్నారు. ప్రధానంగా డాక్టర్ల కొరతతో రోగులు గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తున్నది. ఈ విషయాన్ని ఆస్పత్రి సూపరింటెండెంట్ ప్రసాద్ వద్ద ప్రస్తావించగా.. జ్వరాల కేసులు ఎక్కువగా వస్తున్నాయన్నారు. వాటిలో డెంగ్యూ జ్వరాలు లేవని, బ్లడ్ ఇన్ఫెక్షన్ జ్వరాలు, వైరల్ ఫీవర్స్‌తో ఎక్కువ మంది వస్తున్నారన్నారు. ఆస్పత్రిలో వైద్యుల కొరత ఉన్న మాట వాస్తవమేనన్నారు.



ఆస్పత్రిలో వైద్యం కోసం క్యూకట్టిన రోగులు

ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం

పాయకరావుపేట, జూలై 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఎమ్మార్పీఎస్ 31వ ఆవిర్భావ దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు వై. జంక్షన్ నుంచి చిత్రమందిర్ థియేటర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. చిత్రమందిర్ థియేటర్ సెంటర్‌లో ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరించిన అనంతరం ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా పాల్గొన్న జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ తోట నగేశ్, సీఐ జి.అప్పన్న మందకృష్ణ మాదిగ బర్త్ డే కేక్‌ను కట్ చేసి అందరికీ పంపిణీ చేశారు. అనంతరం పెద్ద ఎత్తున బాణసంచా కాల్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి గంపల చినరాజు, జిల్లా అధికార ప్రతినిధి కొల్లి చిన్నఅప్పారావు, జిల్లా ఇన్‌చార్జి వాసపల్లి వెంకట రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి కాకినాడ కనకేశ్వర రావు, నాయకులు డొక్కా అజయ్‌బాబు, సలికే గోవిందు, ఆరు గుల రమేశ్, కొండబాబు, గంపల సుబ్బారావు, సలికే చినవెంకట రమణ, ముంజులూరి దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.



ఎలమంచిలి: మంద కృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నేతలు

ఎలమంచిలిలో..

పట్టణంలోని క్లబ్ రోడ్డు జంక్షన్‌లో సోమవారం ఎంఆర్‌పీఎస్ 31వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా క్లబ్ రోడ్డు జంక్షన్ నుంచి బస్టాండ్ జంక్షన్ వరకూ ర్యాలీ నిర్వహించారు. జిల్లా ఇన్‌చార్జి పి. వెంకటరావు మాదిగ, జిల్లా ప్రధాన కార్యదర్శి కె. కనకేశ్వరరావు మాదిగ, ఎలమంచిలి ప్రతినిధులు దిగుమర్తి రాజుబాబు, పెదపూడి బండియ్య తదితరులంతా మంద కృష్ణ మాదిగ 60వ పుట్టిన రోజును పురస్కరించుకుని కేక్ కట్ చేసి, స్వీట్లు పంచారు. అనంతరం ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేసి, ఆయన సేవలను పలువురు కొనియాడారు. ఈ కార్యక్రమంలో గోరింట్ల చక్రవర్తి, దిగుమర్తి కనకరాజు, దిగుమర్తి తరుణ్, డి. శ్రీను, కొత్తలంక శేఖర్, కె.ప్రసాద్ బాబు, స్థానికులు పాల్గొన్నారు.



పాయకరావుపేట: మందకృష్ణ మాదిగ బర్త్ డే కేక్‌ని కట్ చేస్తున్న తోట నగేశ్ తదితరులు

ప్రజలను నమ్మించి మోసం చేశారు

- వైసీపీ జిల్లా అధ్యక్షుడు అమర్‌నాథ్

ఎస్.రాయవరం, జూలై 7 (ఆంధ్రజ్యోతి):ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్ర ప్రజలు మోసం చేశారని వైసీపీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. మండలంలోని అడ్డరోడ్డులో వైసీపీ పాయకరావుపేట నియోజకవర్గ ఇన్‌చార్జి కంబాల జోగులు అధ్యక్షతన నిర్వహించిన నియోజకవర్గ విస్తృత సమావేశంలో ఆయన మాట్లాడారు. కొద్ది రోజుల్లో నిర్వహించే బాబు షూరిటీ. మోసం గ్యారెంటీ ద్వారా చంద్రబాబు చేసిన మోసాల గురించి ప్రజలకు వివరించాలని సూచించారు. వైసీపీ నాయకత్వం నాయకులకు. కార్యకర్తలకు అండగా ఉంటుందని, రానున్న ఎన్నికల్లో వైసీపీని తిరిగి అధికారంలోకి తీసుకొచ్చి మరలా జగన్‌ను ముఖ్యమంత్రిని చేసేందుకు రెట్టింపు ఉత్సాహంతో పనిచేయాలని నాయకులు, కార్యకర్తలకు ఆయన పిలుపునిచ్చారు. మాజీ ఎమ్మెల్యే ధర్మశ్రీ కూటమి ప్రభుత్వం, హోం మంత్రి అనితపై పలు విమర్శలు చేశారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి పార్లమెంట్ పరిశీలకులు శోభ హైమావతి, మాజీ ఎమ్మెల్సీ సూర్యనారాయణ రాజు, ఎంపీపీ బొలిశెట్టి గోవిందరావు, నాయకులు వీసం రామకృష్ణ, చిక్కాల రామారావు, బోదెపు గోవింద్, కొణతాల శ్రీనివాసరావు తదితర నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వైసీపీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్

సాగునీటి కాలువలకు మంచిరోజులు

- కూటమి నాయకులు గెడ్డం బుజ్జి, పెదిరెడ్డి చిట్టిబాబు

పాయకరావుపేట రూరల్, జూలై7 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో సాగునీటి కాలువలకు మంచిరోజులు వచ్చాయని కూటమి నాయకులు గెడ్డం బుజ్జి, పెదిరెడ్డి చిట్టిబాబు అన్నారు. మండలంలోని మాసాహెబ్‌పేట ఛానల్ పరిధిలోని ఊరకాలువలో సోమవారం పూడికతీత పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో సాగునీటి కాలువల గురించి పట్టించుకోలేదన్నారు. సాగునీటి కాలువలలో తుప్పలు, పూడిక పెరిగి చివరి ఆయకట్టు భూములకు సాగునీరందక రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత సాగునీటి కాలువలకు గేట్లు మరమ్మతులు చేపట్టడమే కాకుండా పూడికతీత పనులు సాగుతున్నాయన్నారు. కార్యక్రమంలో నీటి సంఘం అధ్యక్షుడు నారపురెడ్డి జోగిరాజు, వైస్ చైర్మన్ కీర్తి సీతారాం, ఏఎంసీ వైస్ చైర్మన్ కంకిపాటి వెంకటేశ్వరరావు, టీడీపీ మండల అధ్యక్షుడు చించలపు ప్రదీప్, పట్టణ అధ్యక్షుడు యాళ్ల వరహాలు, టీడీపీ నాయకులు ఏనుగు చిన్నా, వడ్డాది వాసు, నాగేశ్వరరావు, అప్పన నాగ శివ, దువ్వ శ్రీను, జనసేన నాయకులు యగదాసు నానాజీ, గోళ్ల సన్యాసిరావు పాల్గొన్నారు.



ఊర కాలువలో పూడికతీత పనులను ప్రారంభిస్తున్న దృశ్యం

ఎస్ఈజడ్‌కు భూములిచ్చి నిర్వాసితులయ్యాం..

ఆర్ఆర్ ప్యాకేజీ ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్న అధికారులు

విజయరామపుర అగ్రహారం గ్రామస్థులు

రాంబిల్లి, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ఎస్ఈజడ్ ఏర్పాటుతో తాము నిర్వాసితులమయ్యామని, అర్హులమైన మాకు ఆర్ఆర్ ప్యాకేజీ ఇవ్వకుండా అధికారులు ఇబ్బందులు పెడుతున్నారని విజయరామపుర అగ్రహారానికి చెందిన నిర్వాసితులు లాలం చినతల్లి, లాలం నారాయణమూర్తి, లాలం కొండమ్మ, లాలం తాతబాబు, లాలం నలమహారాజు,లాలం రామూర్తి, లాలం చిట్టమ్మ తదితరులు ఆరోపించారు. మా భూములు, గ్రామాలు, ఇళ్లను తీసుకున్నారని, భూముల్లో ఉన్న స్ట్రక్చర్‌లకు పరిహారం ఇచ్చారని, ఆర్అండ్ఆర్ ప్యాకేజీ ఇవ్వకుండా అధికారులు కుంటి సాకులు చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తాము నివాసముంటున్న ఇళ్లను కేటిల్‌షెడ్లుగా రాసుకొని వెళ్లిపోతున్నారన్నారు. అన్ని ఆధారాలతో పలుమార్లు కలెక్టర్, తహసీల్దార్లకు వినతిపత్రాలు ఇచ్చానా ఆర్అండ్ఆర్ ప్యాకేజీ ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారని ఆరోపించారు.ఎటువంటి సమాచారం ఇవ్వకుండా ఆదివారం అధికారులు తమ ఇళ్లకు వచ్చి వివరాలు అడిగి పొటోలు తీసుకొని వెళ్లారని, మా బాధలు చెప్పుకోవడమే తప్ప అధికారులు మాత్రం న్యాయం చేయడం లేదని నిర్వాసితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి అర్హులమైన మాకు ఆర్ఆర్ ప్యాకేజీ ఇవ్వాలని లేకుంటే కోర్టును ఆశ్రయిస్తామని విజయరామపుర అగ్రహారానికి చెందిన ఎస్ఈజడ్ నిర్వాసితులు తెలిపారు.

డ్రైనేజీలో పూడికతీత పనుల పరిశీలన



పూడికతీత పనులు పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ రమాకుమారి

ఎలమంచిలి, జూలై 7 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీలోని డ్రైనేజీల్లో పూడికతీత పనులను సోమవారం ప్రారంభించారు. ఎల్ఐసీ కార్యాలయం నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకూ ఉన్న యానాద్రి కాలువలో పూడికతీత పనులను మిషన్ల సాయంతో తీస్తున్నారు. మునిసిపల్ కమిషనర్ ప్రసాదరాజు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ పల్లా శ్రీనివాసరావుల పర్యవేక్షణలో ప్రారంభించిన ఈ పనులను చైర్‌పర్సన్ రమాకుమారి పరిశీలించారు. రానున్న వర్షాకాలంలో ప్రజలెవ్వరూ ఇబ్బందులు పడకుండా ఉండేందుకు ముందస్తు చర్యలు పక్కాగా ఉండాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

గోకివాడ క్షేత్ర సహాయకుడుకి సత్కారం



అప్పారావును సత్కరిస్తున్న పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ కృష్ణతేజ

రాంబిల్లి, జూలై 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోకివాడ పంచాయతీ క్షేత్ర సహాయకుడు నీరుకొండ అప్పారావును సోమవారం విజయవాడలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ ఎం.కృష్ణతేజ ఘనంగా సత్కరించారు. గోకివాడ రైతులతో పొలాల్లో ఉపాధి నిధులతో నీటి సంరక్షణకు ఫారం పాండ్‌లను అప్పారావు అధిక సంఖ్యలో తవ్వించడం, గట్లపై కూరగాయల సాగు, అరటి, మునగ, బొప్పాయి మొక్కలు నాటించి రైతులకు ఆదాయం వచ్చే విధంగా తీసుకున్న చర్యలను కమిషనర్ కృష్ణతేజ అభినందించారు. అప్పారావును ఉపాధి పథకం ఏపీఎం శ్రీనివాసరావు అభినందించారు.

శానిటేషన్ పనుల పర్యవేక్షణ

నక్కపల్లి, జూలై 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవవరం గ్రామంలో సోమవారం ఉదయం శానిటేషన్ పనులను ఎంపీడీవో డీ సీతారామరాజు పర్యవేక్షించారు. గ్రామంలోని అన్ని వీధుల్లో ముమ్మరంగా పారిశుధ్య పనులు చేపట్టారు. గ్రామంలోని కొన్ని రహదారుల పక్కన వున్న చెత్త కుప్పలను తొలగించాలని గ్రీన్ అంబాసిడర్లను ఆదేశించారు. సంపద కేంద్రాన్ని తనిఖీ చేశారు. సేంద్రియ ఎరువుల ఉత్పత్తులను పెంచాలని సూచించారు. సెక్రటరీ శ్రీనివాస్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

మత్స్యకారుని కుటుంబానికి ఆర్థిక సాయం



యర్రయ్య కుటుంబానికి నగదు, బియ్యం అందజేస్తున్న దృశ్యం

పాయకరావుపేట రూరల్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): అచ్యుతాపురం మండలం పూడిమడకలో ఇటీవల సముద్రంలో వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు చనిపోయిన చోడిపల్లి యర్రయ్య కుటుంబ సభ్యులకు మండలానికి చెందిన మత్స్యకార నాయకులు 10 వేల రూపాయలు, రెండు బియ్యం బ్యాగులు అందజేసినట్టు రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ మాజీ డైరెక్టరు చోడిపల్లి శ్రీనివాసరావు తెలిపారు. మత్స్యకార నాయకులు చేపల దేవుడు, పిరుమళ్ల నాగేశ్వరరావు, చోడిపల్లి శ్రీనివాసరావు, నక్కపల్లి మండలం తీనార్ల గ్రామ ఎంపీటీసీ సభ్యుడు మేరుగు నాగేశ్వరరావు, తదితరులు సోమవారం చోడిపల్లి యర్రయ్య కుటుంబాన్ని పరామర్శించి, ఆర్థిక సాయాన్ని అందజేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో పూడిమడక గ్రామ పెద్దలు ఓసిపల్లి శ్రీను, ఉమ్మిడి అప్పారావు పాల్గొన్నారు.

'సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలి'

అచ్యుతాపురం జూలై 7(ఆంధ్రజ్యోతి): ఈనెల తొమ్మిదిన జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రొంగలి రాము అన్నారు. సోమవారం అచ్యుతాపురం నుంచి దిబ్బపాలెం వరకు బైక్ ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లడుతూ దేశవ్యాప్తంగా మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా చేస్తున్న ఈ సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో కె సోమునాయుడు, రాజాన సత్తిబాబు, ఆర్ అప్పలకొండ, రెడ్డి చిన్నబాబు, డి అప్పలనాయుడు, డి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జిగా ఆదిబాబు



అచ్యుతాపురం, జూలై 7 (ఆంధ్రజ్యోతి): అచ్యుతాపురం మండల క్లస్టర్ ఇన్‌చార్జిగా కర్రి ఆదిబాబును నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాపై నమ్మకముంచి ఇచ్చిన పదవిని సద్వినియోగం చేసుకుంటానన్నారు. మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు, రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శి రాజాన రమేష్ కుమార్, టీడీపీ మండల అధ్యక్షుడు తులసీరామ్‌లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థులకు డైరీలు పంపిణీ

అచ్యుతాపురం రూరల్, జూలై 7, (ఆంధ్రజ్యోతి):మండలంలోని ఎం.జగన్నాథపురం హైస్కూల్‌లో సోమవారం విద్యార్థులకు డైరీలు పంపిణీ చేశారు. ఎస్‌జీబీ.శంకరరావు జ్ఞాపకార్థం ఆయన కుమారుడు ఎస్.సాయివంశీ, కోడలు స్వప్న పాఠశాలలో గల 219 మంది విద్యార్థులకు డైరీలకు ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కె.రాజారత్నకుమార్, గ్రామ సర్పంచ్ కరెడ్ల ప్రకాష్, ఉపసర్పంచ్ వెంకటేష్, విద్యాకమిటీ చైర్మన్ కాత్యాయినీ, తదితరులు పాల్గొన్నారు.

10న మెగా పేరెంట్ టీచర్స్ మీట్

- ప్రత్యేకాధికారి రహీం

మునగపాక, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ఈనెల 10వ తేదీన మెగా పేరెంట్, టీచర్స్ మీట్ జరగనుందని ప్రత్యేకాధికారి రహీం తెలిపారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలంలో ఉన్న 49 ప్రభుత్వ, 10 ప్రైవేటు పాఠశాలల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. విద్యార్థుల తల్లులతో మాట్లాడడం, వారికి రంగోళి వంటి పోటీలు కూడా జరుగుతాయని చెప్పారు. విద్యార్థులు విధిగా ప్రభుత్వం అందజేసిన ఏకరూప దుస్తులను ధరించాలని చెప్పారు. అనంతరం విద్యార్థులతో తల్లిదండ్రులు పాఠశాలలోనే భోజనం చేయాలన్నారు. తల్లిదండ్రులకు, కమిటీ సభ్యులకు ఆహ్వానాలు విధిగా పంపాలని చెప్పారు. ఈ సమావేశంలో ఎంఈవోలు వేణుగోపాలరావు, శివనాయుడు, ఎంపీడీవో ఎం.ఉషారాణి, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో నాణ్యమైన వసతులు : ఎమ్మెల్యే



అంగన్‌వాడీ కార్యకర్తలకు సామగ్రిని అందజేస్తున్న ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ

కొత్తూరు, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు నాణ్యమైన వసతులు కల్పించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ అన్నారు. రింగురోడ్డులో ఉన్న జనసేన కార్యాలయంలో సోమవారం జీవీఎంసీ పరిధితో పాటు అనకాపల్లి మండలంలో గల 165 అంగన్‌వాడీ కేంద్రాలకు ఇండక్షన్ స్టౌ, కుక్కర్, కళాయి, రెండు గిన్నెలను పంపిణీ చేసి మాట్లాడారు. అనంతరం నియోజకవర్గంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న పోస్టులకు ఎంపికైన వారికి నియామక పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీలో పి.ప్రభావతి, ఏసీడీవో శశికళ తదితరులు పాల్గొన్నారు.

స్పోకెన్ ఇంగ్లీష్ పుస్తకం ఆవిష్కరణ

కొత్తూరు : మునగపాక మండలం పాటిపల్లి ఏపీ మోడల్ స్కూల్, ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇంగ్లీష్ అధ్యాపకుడు డాక్టర్ విల్లూరి ఉమామహేశ్వరరావు రూపొందించిన స్పోకెన్ ఇంగ్లీషు పుస్తకాన్ని ఎమ్మెల్యే కొణతాల ఆవిష్కరించారు. జనసేన పార్టీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో గవర కార్పొరేషన్ డైరెక్టర్ విల్లూరి హరి, నూకాంబిక దేవస్థానం ఉత్సవ కమిటీ మాజీ చైర్మన్ పీలా నాగశ్రీను, మున్సిపల్ మాజీ కౌన్సిలర్ పెతకంశెట్టి జగన్మోహన్, గౌరీపరమేశ్వరుల ఉత్సవ కమిటీ చైర్మన్ కొణతాల సంతోష్‌అప్పారావునాయుడు, జనసేన పార్టీ నాయకులు దూలం గోపి, మంగా ఈశ్వర్, విల్లూరి అప్పారావు, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం : జడ్సీ రమణ



పారిశుధ్య పనులు పరిశీలిస్తున్న జడ్సీ రమణ

అనకాపల్లి టౌన్, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : వర్షాలు కురుస్తున్నందున సీజనల్ వ్యాధులు ప్రజలకు సోకకుండా ఉండేలా ఎప్పటికప్పుడు పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యతనివ్వాలని జీవీఎంసీ అనకాపల్లి జోనల్ కమిషనర్ బీవీ రమణ పారిశుధ్య కార్మికులకు స్పష్టం చేశారు. సోమవారం ఆయన పట్టణంలోని పలు వీధుల్లో విస్తృతంగా పారిశుధ్య పనులను పర్యవేక్షించారు. అలాగే అన్న క్యాంటీన్‌లను పరిశీలించారు. దిబ్బవీధిలోని మినీ రైతు బజార్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్కడా చెత్తా చెదారం నిల్వ ఉండకుండా ఎప్పటికప్పుడు వాహనాల్లో తరలించాలని సూచించారు. అలాగే కాలువలను ఎప్పటికప్పుడు మెరుగుపరచాలన్నారు. ఈయన వెంట పారిశుధ్య విభాగం అధికారులు, సిబ్బంది ఉన్నారు.

'కల్తీ మద్యం తయారీదారులపై చర్యలు చేపట్టాలి'

పరవాడ, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి కొత్తకాలనీ కేంద్రంగా కల్తీ మద్యం తయారు చేసిన వ్యక్తులపై కఠిన చర్యలు చేపట్టాలని పరవాడ గ్రామస్థులు కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్ విజయకృష్ణన్‌ను కలిసి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. కల్తీ మద్యం తయారీ వ్యవహారంలో అసలు దోషులను విడిచిపెట్టి తూ.తూ. మంత్రంగా ఇద్దరు వ్యక్తులను ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేసి చేతులు దులుపేసుకోవడం దారుణమని పేర్కొన్నారు. ఈ వ్యవహారంలో పరవాడ గ్రామానికి చెందిన కొంతమంది వ్యక్తుల ప్రమేయం ఉందని, ఆ దిశగా విచారణ చేపట్టాలని కోరారు. ఈ వ్యవహారంపై లోతుగా విచారణ జరిపించడంతో పాటు తయారీదారుల ఫోన్ కాల్ లిస్టులు బయటపెట్టాలని విజ్ఞప్తి చేశారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో పరవాడ టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు వర్రి చంద్రశేఖర్, గండి మహేష్, పైలా నరేష్, కొమ్మనాపల్లి శ్రీనివాసరావు, బండారు నాయుడు, పైలా వెంకటరమణ, గొరుపూటి వెంకటరావు ఉన్నారు.

ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం



ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులను సత్కరిస్తున్న దృశ్యం

సబ్బవరం, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఆవిర్భావ దినోత్సవాన్ని సోమవారం అమృతపురంలో ఘనంగా నిర్వహించారు. సమితి నాయకుడు జి.సామ్రాట్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలకు బీజేపీ పెందుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి గొర్లె రామునాయుడు ముఖ్య అతిథిగా హాజరై అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జెండాను ఆవిష్కరించి, మందకృష్ణ మాదిగ జన్మదిన కేక్ కట్‌చేశారు. పలువురు సీనియర్ నాయకులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో బైలపూడి రామారావు, సన్యాసిరావు, యేసు, రాజు, ఈశ్వరరావు, దేముడుబాబు, మహేష్, రవి, గంగరాజు, నీటిపల్లి ముత్యాలరావు తదితరులు పాల్గొన్నారు.

ఉగ్గినపాలెంలో ప్రశాంతంగా పాల సంఘం ఎన్నికలు



అధ్యక్షులుగా ఎన్నికైన వారిని అభినందిస్తున్న కూటమి నాయకులు

కశింకోట, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : ఉగ్గినపాలెంలో పాల సంఘం ఎన్నికలు సోమవారం ప్రశాంతంగా జరిగాయి. ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ ఆదేశాల మేరకు పాల సంఘం అధ్యక్షుడిగా ఉడి రమణ ఒక ఏడాది, తాడి రమణ రెండు సంవత్సరాలు, పప్పల రమణ మరో రెండు సంవత్సరాల పాటు కొనసాగుతారని తీర్మానం చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కలగ సోమేశ్వరరావు, కలగ శ్రీను, కరణం రమణ, కోటి తదితరులు పాల్గొన్నారు.

అంతకాపల్లిలో సినిమా షూటింగ్



సినిమా చిత్రీకరణలో పాల్గొన్న నటీనటులు

సబ్బవరం, జూలై 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంతకాపల్లి పరిసర ప్రాంతాల్లో సోమవారం సినిమా షూటింగ్ సందడి నెలకొంది. సబ్బవరంలోనే ప్రారంభమైన 'రజనీ కల్యాణం' సినిమా కొన్ని రోజులుగా పలు ప్రాంతాల్లో మొదటి షెడ్యూల్ పూర్తిచేసుకుంది. స్థానికులే దర్శక, నిర్మాతలుగా వ్యవహరిస్తున్న ఈ సినిమా రెండో షెడ్యూల్‌కు సోమవారం టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు మిడతాడ మహలక్ష్మీనాయుడు క్లాప్ కొట్టారు. టీడీపీ జిల్లా కార్యదర్శి పల్ల తాతారావు స్విచాన్ చేసి షూటింగ్ ప్రారంభించారు. సినిమా షూటింగ్‌ను వీక్షించేందుకు స్థానిక ప్రజలు ఎగబడ్డారు. ఈ సందర్భంగా దర్శకుడు కల్యాణ్ మాట్లాడుతూ పూర్తి గ్రామీణ నేపథ్యం కలిగిన సినిమా అన్నారు. నూతన నటీనటులతో నిర్మితమవుతున్న ఈ సనిమా అత్యంత హాస్యభరితంగా, గ్రామీణ ప్రజలను ఆకట్టుకునేలా ఉంటుందని చెప్పారు.

అర్జీలపై క్షేత్రస్థాయి పరిశీలన

▸▸ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అధికారులకు కలెక్టర్ ఆదేశం ▸▸ వివిధ ప్రాంతాల నుంచి 370 మంది సమస్యలపై నివేదన



ప్రజల నుంచి అర్జీలను స్వీకరింస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్ చిత్రంలో డీఆర్‌వో సత్యనారాయణరావు

అనకాపల్లి కలెక్టరేట్, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : ప్రజల నుంచి అందే ప్రతి అర్జీని అధికారులు వ్యక్తిగతంగా తీసుకోవాలని కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశించారు. క్షేత్రస్థాయిలోకి వెళ్లి ఆయా సమస్యను పరిశీలించి పరిష్కారం చూపాలన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం డీఆర్‌వో వై.సత్యనారాయణరావు, ఎస్‌డీసీ సుబ్బలక్ష్మితో కలిసి ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహించారు. తొలుత ఆమె అధికారులను ఉద్దేశించి మాట్లాడారు. సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తే ఈ కార్యక్రమానికి ప్రజాదరణ మరింత పెరుగుతుందన్నారు. అనంతరం అర్జీలను స్వీకరించారు. పలువురితో స్వయంగా మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. అర్జీలు పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యత ఆయా అధికారులపై ఉందన్నారు.

ఉదయం నుంచి సాయంత్రం వరకు జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 370 మంది విచ్చేసి అర్జీలను సమర్పించారు. జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి జి.రామారావు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారిణి డాక్టర్ ఎం.హైమావతి, ఎక్సైజ్‌శాఖ అధికారి వి.సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీ కార్యాలయంలో...



అర్జీదారులతో మాట్లాడుతున్న ఎస్పీ తుహిన్ సిన్హా

ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఎస్పీ తుహిన్‌సిన్హా అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని సోమవారం తన కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పలువురి నుంచి అర్జీలను స్వీకరించారు. పలువురితో మాట్లాడి వారి సమస్యలను నేరుగా తెలుసుకున్నారు. సంబంధిత స్టేషన్లకు అర్జీలను బదలాయించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 35 మంది అర్జీలు సమర్పించగా ఇందులో ఆస్తి తగాదాలు, కుటుంబ కలహాలు, మోసాలు వంటి వంటిపై ఎక్కువగా ఉన్నాయి. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ ఎల్.మోహనరావు, ఎస్ఐ డి.వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై కార్మికులు నిరసన స్వరాలు

మధ్యాహ్న భోజన పథకం కార్మికుల ఆందోళన



ఎంఈవో రవీంద్రబాబుకు వినతిని అందిస్తున్న భోజనం పథకం కార్మికులు

సబ్బవరం, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మధ్యాహ్న భోజన పథకం కార్మికులు సోమవారం ఇక్కడి ఎమ్మార్సీ భవనం ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల నాయకురాలు ఉప్పాడ సత్యవతి మాట్లాడుతూ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, మెనూ చార్జీలు ఒక్కో విద్యార్థికి రూ.20 ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకుడు ఎం.గౌరీసరావు, మధ్యాహ్న భోజన పథకం కార్మికుల మండల సంఘ నాయకురాళ్లు ఎస్. గౌరీ, పూతి లక్ష్మి, జి.గణపతి, కె.ఆదిలక్ష్మి, పాతిన నారాయణమ్మ, ఎన్. వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

క్లాప్ డ్రైవర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి

అనకాపల్లి టౌన్ : క్లాప్ డ్రైవర్లను ఆప్కోస్‌లో చేర్పించి, ఉద్యోగ భద్రత కల్పించాలని మున్సిపల్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా కార్యదర్శి కోన లక్ష్మణ కోరారు. ఈ మేరకు సోమవారం జీవీఎంసీ జోనల్ కమిషనర్ బీవీ రమణను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతేడాది డిసెంబరు నుంచి నేటి వరకు కార్మికులకు పీఎఫ్‌లు చెల్లించలేదని, వెంటనే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని విన్నవించారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు సమాన పనికి సమాన వేతనం అమలు చేసి ఉద్యోగులకు భద్రత కల్పించాలన్నారు. యూనియన్ నాయకులు బోయిన శేఖర్, కిరణ్, జయరామ్, సింగంపల్లి అజయ్, యర్రంశెట్టి సుమన్ తదితరులు పాల్గొన్నారు.

క్రెబ్స్ కంపెనీ తెరవాలంటూ ర్యాలీ



కాలుష్య నియంత్రణ మండలి కార్యాలయం ఎదుట కార్మికులు నినాదాలు

కశింకోట, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తేగాడ గ్రామంలో ఉన్న క్రెబ్స్ బయో కెమికల్ కంపెనీని తెరవాలని కోరుతూ కార్మికులు సోమవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం విశాఖపట్నంలోని కాలుష్య నియంత్రణ మండలి జోనల్ కార్యాలయం వద్దకు వెళ్లి ఆందోళన చేపట్టారు. జోనల్ కార్యాలయాధికారి సుదర్శనరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఉద్యోగులు ఏవీ అప్పారావు, కన్నబాబు, బాబూరావు, నూకినాయుడు తదితరులు మాట్లాడుతూ కంపెనీ మూసివేయడం వల్ల తామంతా ఉపాధిని కోల్పోయామని ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే ఈ సమస్యపై స్పందించి తమకు న్యాయం చేయాలని విన్నవించారు.

టోల్‌ప్లాజా వర్కర్స్ యూనియన్ నిరసన

తుమ్మపాల, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : కార్మిక హక్కులను కాలరాస్తున్న కేంద్ర ప్రభుత్వానికి బుద్ధి చెప్పేందుకు కార్మికులంతా సిద్ధంగా ఉండాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజాన దొరబాబు పిలుపునిచ్చారు. సోమవారం జరిగిన మర్రిపాలెం టోల్‌ప్లాజా వర్కర్స్ యూనియన్ సమావేశంలో మాట్లాడారు. కార్మికులకు కనీస వేతనాలు రూ. 26వేలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు సమస్యలు పరిష్కరించాలని కోరారు. అనంతరం టోల్‌ప్లాజా వర్కర్స్ యూనియన్ సభ్యులతో కలిసి జాతీయ రహదారిపై నిరసన తెలియజేశారు. ఏఐటీయూసీ నాయకులు వియ్యపు రాజు, అనిల్ రాజా, శ్రీనివాసరావు, చైతన్య, వాసు, నాగేశ్వరరావు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



మంగళగిరిలో 'మళ్ల' అర్జీల స్వీకరణ

అనకాపల్లి, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : గుంటూరు జిల్లా మంగళగిరిలో గల తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో గవర సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర పలువురి నుంచి అర్జీలను స్వీకరించారు. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి విచ్చేసిన వారితో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. సంబంధిత శాఖల అధికారులకు అర్జీలను పంపనున్నట్టు తెలిపారు.

మేనిఫెస్టోలో హామీలను అమలు చేయాలి

▸▸ నేషనల్ హెల్త్ మిషన్ జేఏసీ చైర్మన్ దయామణి



సమావేశంలో సంఘీభావం తెలుపుతున్న యూనియన్ నాయకులు

అనకాపల్లి టౌన్, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేయాలని నేషనల్ హెల్త్ మిషన్ జేఏసీ చైర్మన్ దయామణి డిమాండ్ చేశారు. ఇక్కడి సీఐటీయూ కార్యాలయంలో సోమవారం జేఏసీ జనరల్ సెక్రటరీ జయరాజ్ ఆధ్వర్యంలో జరిగిన ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమావేశంలో మాట్లాడారు. నేషనల్ హెల్త్ మిషన్‌లో రాష్ట్రంలో 22వేల మంది ఉద్యోగులు 198కేడర్లలో పనిచేస్తున్నారన్నారు. వీరంతా పదిహేనేళ్లుగా తక్కువ వేతనాలతో శ్రమదోపిడీకి గురవుతున్నారని వాపోయారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు ఈ ఉద్యోగులకు మినిమం టైం స్కేల్, ఒకే కేడర్ ఒకే వేతనం అమలు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. జేఏసీ గౌరవాధ్యక్షుడు, సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఏవీ నాగేశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక, కర్షక విధానాలను తుంగలోకి తొక్కడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. లేబర్ కోడ్స్ రద్దు చేయాలని దేశవ్యాప్తంగా తలపెట్టే సమ్మెను అంతా విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు ఈ సమావేశంలో ఎన్‌హెచ్‌ఎం కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సస్ ఫెడరేషన్ అధ్యక్షురాలు శిరీషా, జేఏసీ జిల్లా చైర్మన్ వీవీ శ్రీనివాసరావు, పెంటయ్య, డాక్టర్ బీఎన్ రాజు తదితరులు పాల్గొన్నారు.



లక్ష్మీదేవిపేటలో మహిళలకు కరపత్రాలు పంపిణీ చేస్తున్న బుద్ద

అనకాపల్లి టౌన్, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల ముందు కూటమి ఇచ్చిన హామీల్లో భాగంగానే అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రభుత్వం పనిచేస్తుందని మాజీ ఎమ్మెల్సీ, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బుద్ద నాగజగదీశ్వరరావు అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా సోమవారం లక్ష్మీదేవిపేటలో ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలకు సంబంధించిన కరపత్రాలను మహిళలకు పంపిణీ చేశారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోలేనప్పటికీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రజలకు ఇచ్చిన హామీల అమలే ధ్యేయంగా పనిచేస్తున్నారన్నారు. అనంతరం ఆయా ప్రాంతాల్లో సమస్యలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కర్రి గోపి, కాండ్రేగుల ముకుంద, మళ్ల శివనారాయణ, కొణతాల పెద్దవాసు, కాళ్ల రమణబాబు, కొమ్మర్తి నారాయణ, పొలిమేర నాయుడు తదితరులు పాల్గొన్నారు.

'చంద్రబాబుతోనే సుపరిపాలన'



పెదనాయుడుపాలెంలో మహిళకు పథకాలను వివరిస్తున్న గండి బాబ్జీ

సబ్బవరం మండలంలో...

సబ్బవరం : వైసీపీ పాలనతో అన్ని రంగాల్లో నష్టపోయిన రాష్ట్రాన్ని గాడిన పెట్టి, సుపరిపాలన అందించడం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతోనే సాధ్యమని ఆంధ్రప్రదేశ్ ఆయిల్‌ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ గండి బాబ్జీ అన్నారు. పెదనాయుడుపాలెం, కొత్తరోడ్డు, గణపతిపురం గ్రామాల్లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా విస్తృతంగా పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. సంక్షేమ పథకాలకు సంబంధంచిన కరపత్రాలను పంపిణీ చేశారు. నాయకులు గండి వంశీదీప్, గండి ముత్యాలనాయుడు, భరణికాన బాబూరావు, కోరాడ శ్రీను, రెడ్డి దేముడు, పోతల కనకరాజు, నాగేంద్ర, పల్ల తాతారావు, చైతన్య, గండి దేముడు, అప్పలనాయుడు, అప్పారావు, రమణమ్మ, రమేష్, సత్యనారాయణ, రెడ్డి రాజు, అక్కుబాబు, సత్యనారాయణ, రాజు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శ్రీవారి ఆలయంలో ధ్వజారోహణం



ధ్వజారోహణం చేస్తున్న అర్చకులు

అనకాపల్లి టౌన్, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని దేమునిగుమ్మం వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీవారి పవిత్రోత్సవాల్లో భాగంగా సోమవారం ధ్వజస్తంభం వద్ద ధ్వజారోహణం కార్యక్రమాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తొలుత స్వామివారికి ఆలయ ప్రధానార్చకులు పులఖండం విజయబాబు, గిరిబాబుల అర్చక బృందం విశేష పూజలు జరిపారు. పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఆలయ ఈవో బి.మురళీకృష్ణ, మాజీ చైర్మన్ బొలిశెట్టి శ్రీనివాసరావు, మాజీ సభ్యులు గోలి మురళీ, వేదుల సూర్యప్రభ, కొణతాల అరుణ, సీహెచ్.నూకరాజు పాల్గొన్నారు.

పశుగ్రాస వారోత్సవాల పోస్టర్లు ఆవిష్కరణ

అనకాపల్లి కలెక్టరేట్, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : పాడి రైతులంతా పశుగ్రాస వారోత్సవాలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ విజయకృష్ణన్ పిలుపునిచ్చారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో డీఆర్‌వో వై. సత్యనారాయణరావు, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ రామ్మోహన్‌రావుతో కలిసి సోమవారం ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించి ఆమె మాట్లాడారు. సోమవారం ప్రారంభమై ఈ వారోత్సవాలు పద్నాలుగో తేదీ వరకు జరుగుతాయని, ఇందులో భాగంగా రైతులకు సబ్సిడీపై పశుగ్రాస విత్తనాలు, జొన్న, మొక్కజొన్న, పిల్లిపెసర వంటి వాటిని ప్రభుత్వం అందిస్తుందన్నారు.

జగన్నాథస్వామి ఆలయ ఆదాయం రూ.14.7 లక్షలు

అనకాపల్లి టౌన్, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : జగన్నాథ స్వామి రథయాత్రోత్సవాల్లో భాగంగా స్వామివారి ఆలయ హుండీని సోమవారం లెక్కించారు. అగ్గిమర్రి చెట్టు వద్ద గల ఆలయ మండపంలో జరిగిన ఈ కార్యక్రమంలో హుండీ, దర్శనం టికెట్ల ద్వారా రూ. 14,70,552ల ఆదాయం లభించిందని ఆలయ ఈవో మురళీ, చైర్మన్ దాడి బుజ్జి తెలిపారు. గత ఏడాదితో పోల్చితే ఈ ఏడాది రూ.లక్షా 45వేలు అదనంగా వచ్చినట్టు చెప్పారు. దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ వసంతకుమార్, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అనకాపల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు 'పిళ్లా'కు సత్కారం



హరశ్రీనివాసరావును సత్కరిస్తున్న బీజేపీ నాయకులు

అనకాపల్లి టౌన్, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎన్నికైన న్యాయవాది పిళ్లా హర శ్రీనివాసరావును సోమవారం బీజేపీ నాయకులు అభినందించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి కొండబాబు, అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ బొడ్డేడ నాగేశ్వరరావు, న్యాయవాదులు పిల్లల వాసు, సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

అనకాపల్లి కలెక్టరేట్, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర కారాగారంలో శిక్ష అనుభవిస్తూ మృతి చెందిన వ్యక్తి కుటుంబానికి ప్రభుత్వ సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కును కలెక్టర్ విజయకృష్ణన్ సోమవారం ఇక్కడ అందజేశారు. అనకాపల్లి మండలం జగన్నాథపురం గ్రామానికి చెందిన ముమ్మల ప్రసాద్ అనే వ్యక్తి ఓ నేరం కింద కేంద్ర కారాగారంలో శిక్ష అనుభవిస్తూ 2020 ఆగస్టు 20వ తేదీన మృతిచెందాడు. ఈయన కుటుంబ సభ్యులు జాతీయ మానవ హక్కుల సంఘానికి ఆర్థిక సహాయం అందేలా చర్యలు చేపట్టాలని అర్జీ సమర్పించారు. ఎన్‌హెచ్‌ఆర్‌సీ ఆదేశాల మేరకు నిరాదరణకు గురైన మృతుడి కుటుంబానికి ప్రభుత్వం రూ.ఐదు లక్షలు మంజూరు చేయగా, సదరు చెక్కును కలెక్టర్ అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌వో వై.సత్యనారాయణరావు ఉన్నారు.

బేవరేజెస్ కార్మికులు ఉద్యోగ భద్రత కోరుతూ వినతి

అనకాపల్లి టౌన్, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : బేవరేజెస్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ జిల్లా ప్రధానకార్యదర్శి ఆర్.శంకరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఇక్కడి బేవరేజెస్ డిపో వద్ద జరిగిన కార్మికుల సమావేశంలో మాట్లాడారు. బేవరేజెస్ హమాలీ కార్మికులకు పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతన ఒప్పందం చేయాలని, నాల్గో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. ఈ సమావేశంలో కొండారావు, బి. వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

'పండగలా పేరెంట్స్ సమావేశం'

పరవాడ, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : విద్యాశాఖ ఆదేశాల మేరకు ఈ నెల 10న అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో పేరెంట్స్ సమావేశాన్ని పండగలా నిర్వహించాలని మండల ప్రత్యేకాధికారిణి బి.సరోజిని పిలుపునిచ్చారు. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులతో సోమవారం ఇక్కడ నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. విద్యార్థుల తల్లిదండ్రులు నూరుశాతం సమావేశానికి హాజరయ్యేలా చూసుకోవాలన్నారు. మత్తు పదార్థాల నిషేధం, గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించాలన్నారు. ఎంపీడీవో బి.రమేష్‌నాయుడు, ఎంఈవోలు ఎం.దివాకర్‌రావు, సాయి శైలజా తదితరులు పాల్గొన్నారు.

సీలేరు నదిలో స్నానాల ఘాట్‌లను ఏర్పాటు చేయాలి

సీలేరు, జూలై 7 (ఆంధ్రజ్యోతి): సీలేరు నది పరివాహక ప్రాంతంలో పుష్కరాల ఘాట్‌లను ఏర్పాటు చేయాలని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి కారే శ్రీనివాస్ కోరారు. సోమవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ రానున్న గోదావరి పుష్కరాలను దృష్టిలో పెట్టుకుని గోదావరి నదికి ఉప నది అయిన సీలేరు నది పరివాహక ప్రాంతాల్లో కూడా పుష్కర ఘాట్‌లను ఏర్పాటు చేస్తే ఈ ప్రాంత గిరిజనులు కూడా గోదావరిలో పుష్కర స్నానాలు చేసిన అనుభూతి పొందుతారన్నారు. ఇలా చేస్తే ఈ ప్రాంతాలు కూడా ఆధ్యాత్మికంగా, పర్యాటకంగా ఎంతో అభివృద్ధి చెందడానికి అవకాశం ఉంటుందన్నారు. ఇటీవల సీలేరు మారెమ్మ ఆలయం ఎదుట నిర్మించిన స్నానాల ఘాట్ కూడా మరింతగా అభివృద్ధి చేయాలని కారే శ్రీనివాస్ కోరారు.

పర్యావరణ పరిరక్షణే ధ్యేయం

- సిఫా ట్రస్టు సీఈవో డాక్టర్ శశిప్రభ


మొక్కలు నాటుతున్న శశిప్రభ, సిబ్బంది

చింతపల్లి, జూలై 7 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణకు తల్లి పేరిట ప్రతి ఒకరూ మొక్కలు నాటాలని సిఫా ట్రస్టు సీఈవో డాక్టర్ శశిప్రభ అన్నారు. సోమవారం లంబసింగి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. విద్యార్థులకు గుడ్డ సంచులను పంపిణీ చేశారు. ఈసందర్భంగా సిఫా ఆమె మాటాడుతూ పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. ప్రాణవాయువుని ఇచ్చే చెట్లను కాపాడుకోవాలన్నారు గ్రీన్ క్లైమెట్ టీం ఎన్‌జీవో వ్యవస్థాపక కార్యదర్శి జేవీ రత్నం మాట్లాడుతూ పండ్ల జాతి మొక్కలు పెంచుకోవడంపై గిరిజనులు ఆసక్తి పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఎం.సతీశ్, సిఫా సంస్థ సిబ్బంది సర్సింగ్, శ్రీనివాస్, దుర్గాప్రసాద్, భాస్కర్, లక్ష్మి పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ


విద్యార్థికి వైద్య పరీక్షలను నిర్వహిస్తున్న ధారకొండ పీహెచ్‌సీ వైద్యాధికారి డీకే హిమబిందు

సీలేరు, జూలై 7 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల ఆరోగ్యం పట్ల తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ధారకొండ పీహెచ్‌సీ వైద్యాధికారి డీకే హిమబిందు అన్నారు. డీఎంహెచ్‌వో ఆదేశాల మేరకు సోమవారం ధారకొండ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వైద్య శిబిరంలో విద్యార్థులకు ఆమె వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా హిమబిందు మాట్లాడుతూ వాతావరణంలో కల్గిన మార్పులతో విద్యార్థులకు జలుబు, జ్వరం, అతిసారం, తదితర రోగాలు ప్రబలే అవకాశాలున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌ఎన్ రాణి, ఏఎన్‌ఎంలు కృష్ణకుమారి, ఈశ్వరి పాల్గొన్నారు.

ఎన్నికల హామీలను నెరవేర్చిన కూటమి ప్రభుత్వం

- టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి


గిరిజనులకు తొలి అడుగు కరపత్రాలను అందజేస్తున్న గిడ్డి ఈశ్వరి

చింతపల్లి, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం నెరవేరుస్తున్నదని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి అన్నారు. సోమవారం మండలంలోని కొత్తపూరులో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి గిరిజనులను కలిసి కూటమి ప్రభుత్వ పాలనపై అభిప్రాయాలు తీసుకున్నారు. అలాగే కూటమి ప్రభుత్వం ఏడాది కాలంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా గిడ్డి ఈశ్వరి మాట్లాడుతూ పింఛన్ల పెంపు, తల్లికి వందనం, ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకాలను అమలు చేసిందన్నారు. నిరుద్యోగుల కోసం 16,347 డీఎస్సీ పోస్టులు భర్తీకి చర్యలు ప్రారంభించిందన్నారు. ఆగస్టు నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఖరీఫ్‌కి ముందుగానే అన్నదాత సుఖీభవ పథకాలు అందుబాటులోకి వస్తాయన్నారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి చల్లంగి లక్ష్మణరావు, టీడీపీ మండల అధ్యక్షుడు కిల్లో పూర్ణచంద్రరావు, గ్రామ కమిటీ అధ్యక్షుడు రీమల ఆనందరావు, పార్టీ నాయకులు అబ్బాయినాయుడు, మహేంద్ర, జస్వంత్, వల్లి, శెట్టి నాగేశ్వరరావు, రమణ, ఎంపీటీసీ మాజీ సభ్యుడు రమణమూర్తి పాల్గొన్నారు.

హైడ్రో పవర్ ప్రాజెక్టు సర్వేను నిలిపివేయాలి : గిరిజన సంఘం


జిల్లా కలెక్టర్ ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్న గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర తదితరులు

పాడేరురూరల్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): అనంతగిరి మండలం పెదకోట, చిట్టంపాడు, కుజ్జెలి గ్రామాల్లో హైడ్రో పవర్ ప్రాజెక్టు నిర్మాణానికి అదానీ ఎనర్జీ, నవయుగ కంపెనీలు చేపట్టిన సర్వేను తక్షణమే నిలిపివేయాలని జిల్లా కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్‌ను కోరామని గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర, అనంతగిరి జడ్పీటీసీ సభ్యుడు దిసారి గంగరాజు తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ దినేశ్‌కుమార్ గిరిజన సంఘం ప్రతినిధులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పవర్ ప్రాజెక్టు నిర్మాణం చేపడితే 10 పంచాయతీలకు చెందిన 50 గ్రామాలలో వేలాది మంది ఆదివాసీల మనుగడ దెబ్బతింటుందన్నారు. ఈ ప్రాజెక్టు ఒప్పందాలను రద్దు చేయాలని, పవర్ ప్రాజెక్టు నిర్మాణ సామర్థ్యాన్ని పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవో 51ని రద్దు చేయాలని కోరుతూ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో పెదకోట గ్రామానికి చెందిన జి.ఆనంద్, కె.ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ ఏఎన్‌ఎంల బదిలీ సర్క్యులర్ వెనక్కి తీసుకోవాలి

సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఎల్.సుందరరావు డిమాండ్

పాడేరురూరల్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): పాడేరు డివిజన్ పరిధిలోని గ్రామ, వార్డు సచివాలయాల్లో విధులు నిర్వహిస్తున్న గ్రేడ్-3 ఏఎన్‌ఎంల బదిలీలకు రెండోసారి విడుదల చేసిన సర్క్యులర్‌ను అధికారులు వెంటనే వెనక్కి తీసుకోవాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఎల్.సుందరరావు డిమాండ్ చేశారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఏఎన్‌ఎం బదిలీలకు గత నెల 30వ తేదీన ఉమ్మడి విశాఖపట్నం జిల్లా డీఎంహెచ్‌వో ఆదేశాలు జారీ చేశారన్నారు. దాంతో బదిలీలు సజావుగా జరుగుతున్న నేపథ్యంలో ఈనెల 3వ తేదీన డీఎంహెచ్‌వో పాడేరు డివిజన్ పరిధిలో ఉన్న 11 మండలాల్లో పనిచేస్తున్న ఏఎన్‌ఎంలకు మాత్రమే ఎందుకు జారీ చేయాల్సి వచ్చిందని ఆయన ప్రశ్నించారు. తక్షణమే జిల్లా కలెక్టర్, అల్లూరి జిల్లా డీఎంహెచ్‌వో స్పందించి ఈ నెల 3వ తేదీన విడుదల చేసిన సర్క్యులర్‌ను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే సచివాలయ ఏఎన్‌ఎంలతో కలిసి ఆందోళన చేపడతామని ఆయన హెచ్చరించారు.

ఓపెన్ స్కూల్ అడ్మిషన్లు పెంపుపై ప్రచారం : డీఈవో


మాట్లాడుతున్న డీఈవో బ్రహ్మాజీరావు

పాడేరురూరల్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈ విద్యా సంవత్సరం ఓపెన్ స్కూల్‌లో టెన్త్, ఇంటర్మీడియట్ అడ్మిషన్లు పెంపుపై ఎ-1 కో-ఆర్డినేటర్‌లు, సచివాలయ వెల్ఫేర్ సిబ్బంది సమన్వయంతో ప్రచారం నిర్వహించాలని జిల్లా విద్యాశాఖాధికారి పి. బ్రహ్మాజీరావు, ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ ఆర్.శశికుమార్ అన్నారు. అడ్మిషన్‌లకు సంబంధించిన నోటిఫికేషన్ విడుదల చేసిందన్నారు. సోమవారం నిర్వహించిన పాడేరు డివిజన్ ఎ-1 కోర్డినేటర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ సార్వత్రిక విద్యా విధానం విశిష్టత, అడ్మిషన్‌లు పెంచాల్సిన ఆవశ్యకతను వివరించారు. అనంతరం ఓపెన్ స్కూల్స్ ప్రచార పోస్టర్, కరపత్రాలను ఆవిష్కరించారు.

ఏపీ గట్కా అసోసియేషన్ రిఫరీగా పాండురాజు


రిఫరీగా నియామకపత్రాన్ని అందుకుంటున్న పాండురాజు

పాడేరురూరల్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా ఇంటర్నేషనల్ కోఫుకాన్ కరాటే క్లబ్ చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ ఎగ్జామినార్ బాకూరు పాండురాజును ఏపీ గట్కా అసోసియేషన్ రిఫరీగా నియమిస్తూ సౌత్ ఇండియా గట్కా చైర్మన్ సురేంద్ర ఉత్తర్వు లు జారీ చేశారు. ఈ మేరకు సోమవారం ధ్రువ పత్రాన్ని, గుర్తింపు కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా పాండురాజు మాట్లాడుతూ ఈనెల5,6 తేదీల్లో విజయవాడలో జరిగిన కార్యక్రమంలో తనను రిఫరీగా ఎంపిక చేశారన్నారు. తనను రిఫరీగా ఎంపిక చేసిన సౌత్ ఇండియా గట్కా చైర్మన్ సురేంద్రకు, ఏపీ టెక్నికల్ డైరెక్టర్ సత్యశ్రీకాంత్‌లకు పాండురాజు కృతజ్ఞతలు తెలిపారు.

గిరిజన రైతులకు పండ్ల మొక్కలు పంపిణీ

పాడేరురూరల్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని డి.గొందూరు ల్యాండ్ స్కేప్ పరిధిలోని గిరిజన రైతులకు మామిడి, నేరేడు, సపోటా, సీతాఫలం, జామ, టేకు తదితర మొక్కలను సోమవారం పంపిణీ చేసినట్టు సబల ప్రాజెక్టు జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ నాయుడు తెలిపారు. ఎకరానికి వంద చొప్పున మొక్కలు అందజేశామన్నారు. అదేవిధంగా జి.మాడుగుల మండలం ఎం.నిట్టాపుట్టు, అనంతగిరి మండలం పినకోట రైతులకు మొక్కలు పంపిణీ చేశామన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేల క్రమక్షయం అరికట్టడం, జీవ వైవిధ్యం పెంచడం, గిరిజన రైతుల జీవనోపాధి పెంపొందించడమే ఆగ్రో ఫారెస్ట్రీ మోడల్ లక్ష్యం అన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సబల్ ప్రాజెక్టు సీసీలు సత్యనారాయణ, ప్రకాష్, మాణిక్యం, పెసా కమిటీ ప్రతినిధులు, ఆర్‌వైఎస్‌ఎస్ టీమ్ సభ్యులు పాల్గొన్నారు.

గిరిజన ఐక్యవేదిక జిల్లా నూతన కమిటీ ఏర్పాటు


గిరిజన ఐక్యవేదిక జిల్లా నూతన కమిటీ ప్రతినిధులు

పాడేరురూరల్, జూలై 7(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం గిరిజన భవన్‌లో ఆదివారం జరిగిన గిరిజన ఐక్యవేదిక రాష్ట్ర స్థాయి సమావేశంలో అల్లూరి జిల్లా ఐక్యవేదిక నూతన కమిటీని ఏర్పాటు చేసినట్టు నూతన గౌరవాధ్యక్షురాలు గిడ్డి వరలక్ష్మి సోమవారం తెలిపారు. ఐక్యవేదిక జిల్లా అధ్యక్షులుగా సుర్ల లోవరాజు, కార్యదర్శిగా శెట్టి లక్ష్మణరావు, జిల్లా ముఖ్య సలహాదారుడిగా కుడుముల రామకృష్ణ, సలహాదారులుగా తమర్బ ప్రసాద్, మండి నాగేశ్వరరావు, కంబిడి సుమిత్ర, జిల్లా ఉపాధ్యక్ష, సహాయకార్యదర్శులుగా కంకిపాటి రామారావు, కొండపల్లి మత్స్యరాజు, లకే భాస్కర్, డాక్టర్.పల్లుల రాజకుమార్, డోకులూరు రామారావు, సత్యనారాయణ, సంపత్‌కుమార్, బి.కృష్ణవేణి, మహిళా కార్యదర్శిగా బి.పద్మ, అనీల్‌కుమార్, చైతన్య, సతీష్‌కుమార్‌లతో పాటు 27 మంది సభ్యులను ఎన్నుకోవడం జరిగిందన్నారు.

పేదలకు నిత్యావసర సరుకుల పంపిణీ

పాడేరురూరల్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): నవజీవన్ ట్రస్టు వ్యవస్థాపకులు డాక్టర్.శ్రీధర్ ఆచార్య జన్మదినం సందర్భంగా సోమవారం 30 మంది పేదలకు నిత్యావసర సరుకులను టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కొట్టగుళ్లి సుబ్బారావు పంపిణీ చేశారు. స్థానిక గుడివాడలోని నవజీవన్ ట్రస్టు నిరుపేద పిల్లల సేవాకేంద్రంలో డాక్టర్ శ్రీధర్ ఆచార్య జన్మదిన వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివాసీ నిరుపేదలకు ట్రస్టు మరిన్ని సేవా కార్యక్రమాలను అందించాలని కోరారు. కార్యక్రమంలో జడ్పీ మాజీ చైర్‌పర్సన్ వంజంగి కాంతమ్మ, తాంగుల మహేష్, వర్తన పిన్నయ్యదొర, ప్రభుత్వ ఉన్నత పాఠశాల పీడీ సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

లోతుగెడ్డ పశువైద్యాధికారిగా సౌజన్యదేవి



చింతపల్లి, జూలై 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లోతుగెడ్డ పశువైద్యాధికారిగా డాక్టర్ మత్స్యరాస సౌజన్యదేవి నియమితులయ్యారు. తాజా బదిలీల్లో ఇక్కడ పనిచేసిన పశువైద్యాధికారి డాక్టర్ దేశగిరి దమయంతిని అనకాపల్లి జిల్లాకు బదిలీ కాగా ఆమె స్థానంలో ముంచంగిపుట్టు కిలగడలో పనిచేస్తున్న సౌజన్యదేవిని నియమించారు. ఈమేరకు ఆమె సోమవారం విధుల్లో చేరారు.

ఏజెన్సీలో ఇంటింటికీ రేషన్ అందజేయాలి

- పలుచోట్ల వాగులు పొంగిపొర్లుతుండడం వల్ల డిపోలకు వెళ్లలేని పరిస్థితి
- గతంలో వలే వాహనాల ద్వారా సరకులు అందిస్తే గిరిజనులకు ఎంతో మేలు
- ప్రభుత్వం ఈ దిశగా చర్యలు చేపట్టాలి : ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం


విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం

అరకులోయ, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం గత నెల నుంచి ఇంటింటికీ వాహనాల ద్వారా రేషన్ సరకుల పంపిణీ నిలిపివేయడం వలన మన్యంలో అధిక శాతం గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం అన్నారు. సోమవారం సాయంత్రం ఇక్కడి తన నివాసగృహంలో అనంతగిరి ఎంపీపీ శెట్టి నీలవేణి, గుమ్మకోట సర్పంచ్ పాగి అప్పారావు, కో-ఆప్షన్ సభ్యుడు షేక్ మదీనాతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రస్తుతం వర్షా కాలం కావడంతో చాలా గ్రామాల్లో గిరిజనులకు రేషన్ అందే పరిస్థితి ఉండదన్నారు. రేషన్ డిపోలకు దూరంగా ఎక్కువ గ్రామాలు ఉన్నట్టు చెప్పారు. ప్రస్తుతం వాగులు ప్రమాదకరంగా ప్రవహిస్తుండున గిరిజనులు డీఆర్ డిపోలకు వచ్చి రేషన్ తీసుకోలేరన్నారు. ప్రభుత్వం ఇక్కడి పరిస్థితులను గుర్తించి గతంలో వలే వాహనా ద్వారా ఇంటింటికీ రేషన్ సరకులు పంపిణీ చేయాలని కోరారు. ఈ రకంగా చర్యలు చేపడితే శత శాతం గిరిజనులకు లబ్ధి చేకూరుతుందని వివరించారు. అలాగే, గత నెలలో రేషన్ తీసుకోలేని వారికి ఈ నెలతో కలిసి సరకులను అందజేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఇదిలావుంటే, హైడ్రో ప్రాజెక్టుల వలకల గిరిజనులకు ఒరిగిందేమీ లేదని మత్స్యలింగం ఎద్దేవా చేశారు. అనంతగిరి మండలం టోకూరు, గుమ్మకోట, పెద్దకోట పంచాయతీల పరిధిలోని చిట్టింపాడు, గుజ్జెలి, కుడియా గ్రామాల సమీపంలో అదానీకి రెండు, నవయుగకు ఒక ప్రాజెక్టు రాష్ట్ర ప్రభుత్వం కట్టబెట్టిందని ఆరోపించారు. ఈ ప్రాజెక్టుల వల్ల కార్పొరేట్ సంస్థల కు కోట్లాది రూపాయల ఆదాయం వస్తుందేమోగానీ గిరిజనానికి మాత్రం తీవ్ర నష్టమన్నారు. తక్షణమే ఈ ప్రాజెక్టులను రద్దు చేయాలని కోరారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం గిరిజనుల అభివృద్ధికి కృషిచేసి ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. విద్యార్థుల అధికశాతం అడ్మిషన్ల దృష్ట్యా ప్రతి మండలానికి ఆశ్రమోన్నత పాఠశాలలను నూతనంగా మంజూరు చేయాని కోరారు.

పశుగ్రాస వారోత్సవాల పోస్టర్లు ఆవిష్కరణ

అనకాపల్లి కలెక్టరేట్, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : పాడి రైతులంతా పశుగ్రాస వారోత్సవాలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ విజయకృష్ణన్ పిలుపునిచ్చారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో డీఆర్‌వో వై. సత్యనారాయణరావు, జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారి డాక్టర్ రామ్మోహన్ రావుతో కలిసి సోమవారం ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించి ఆమె మాట్లాడారు. సోమవారం ప్రారంభమై ఈ వారోత్సవాలు పద్నాలుగో తేదీ వరకు జరుగుతాయని, ఇందులో భాగంగా సబ్సిడీపై పశుగ్రాస విత్తనాలు, జొన్న, మొక్కజొన్న, పిల్లిపెసర వాటిని ప్రభుత్వం అందిస్తుందన్నారు.

మధ్యాహ్న భోజన పథకం కార్మికుల ఆందోళన

సబ్బవరం, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మధ్యాహ్న భోజన పథకం కార్మికులు సోమవారం ఇక్కడి ఎమ్మార్వీ భవనం ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల నాయకురాలు ఉప్పాడ సత్యవతి మాట్లాడుతూ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, మెనూ చార్జీలు ఒక్కో విద్యార్థికి రూ.20 ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకుడు ఎం.గౌరీసరావు, మధ్యాహ్న భోజన పథకం కార్మికుల మండల సంఘ నాయకురాళ్లు ఎస్. గౌరీ, పూతి లక్ష్మి, జి.గణపతి, కె.ఆదిలక్ష్మి, పాతిన నారాయణమ్మ, ఎస్. వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

అనకాపల్లి కలెక్టరేట్, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర కారాగారంలో శిక్ష అనుభవిస్తూ మృతి చెందిన వ్యక్తి కుటుంబానికి ప్రభుత్వ సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కును కలెక్టర్ విజయకృష్ణన్ సోమవారం ఇక్కడ అందజేశారు. అనకాపల్లి మండలం జగన్నాథపురం గ్రామానికి చెందిన ముప్పల ప్రసాద్ అనే వ్యక్తి ఓ నేరం కింద కేంద్ర కారాగారంలో శిక్ష అనుభవిస్తూ 2020 ఆగస్టు 20వ తేదీన మృతిచెందాడు. ఈయన కుటుంబ సభ్యులు జాతీయ మానవ హక్కుల సంఘానికి ఆర్థిక సహాయం అందేలా చర్యలు చేపట్టాలని అర్జీ సమర్పించారు. ఎన్‌హెచ్‌ఆర్‌సీ ఆదేశాల మేరకు మృతుడి కుటుంబానికి ప్రభుత్వం రూ.ఐదులక్షలు మంజూరు చేయగా, సదరు చెక్కును కలెక్టర్ అందజేశారు.

వాగులు, వంకల్లో ఉధృత ప్రవాహం

- కొద్ది రోజులుగా ఏజెన్సీలో కుండపోత వర్షాలు
- మత్స్యగెడ్డ పరవళ్లతో నాటుపడల ప్రయాణాలు నిలిపివేత
- నిత్యావసర సరకుల కోసం గిరిజనం అవస్థలు


ముంచంగిపుట్టు మండలం దొరగూడ సమీపంలో ఉధృతంగా ప్రవహిస్తున్న పెద్ద గెడ్డ

ముంచంగిపుట్టు, జులై 7 (ఆంధ్రజ్యోతి) : వాతావరణంలో మార్పుల కారణంగా గత కొద్ది రోజులుగా కురుస్తున్న కుండపోత వర్షాలకు మండలంలోని పలుచోట్ల మత్స్యగెడ్డ పాయలు, వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. దీంతో గెడ్డ పరీవాహక ప్రాంతీయులు రాకపోకలు సాగించేందుకు అవరోధంగా మారింది. పెదగూడ, బంగారుమెట్ట, సుజనకోట, దారెల, పనసపుట్టు, జోలాపుట్టు ప్రాంతాల మీదుగా ప్రవహిస్తున్న మత్స్యగెడ్డ వరద నీటితో ఉధృతంగా ఉంది. ఫలితంగా మత్స్యగెడ్డ ప్రవాహిత నీటిపై ఆధారపడి ఉన్న జోలాపుట్టు, డుడుమ జలాశయాల్లో వరదనీరు ఇన్‌ఫ్లో పెరిగి నీటి నిల్వలు గరిష్ఠ స్థాయికి చేరుకుంటున్నాయి. భారీ వర్షాలకు తోడు గాలులు వీస్తుండడంతో మత్స్యగెడ్డపై నాటుపడల ప్రయాణం మరింత ప్రమాదకరంగా మారింది. దీంతో గతవారం రోజులుగా పలు ప్రాంతాల్లో అత్యవసరమైతే తప్ప మత్స్యగెడ్డ దాటేందుకు నాటు పడలను ఉపయోగించడం లేదు. అలాగే మండలంలోని కించాయిపుట్టు, బంగారుమెట్ట, జర్రెల, జర్జుల, బూసిపుట్టు, లక్ష్మీపురం, బరడ, రంగబయలు, బుంగాపుట్టు తదితర పంచాయతీల్లోని పలు ప్రాంతాల్లో మత్స్యగెడ్డ పాయలు వరదనీటితో ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. చిన్నా పెద్ద తేడాలేకుండా మత్స్యగెడ్డ పాయలు వరదనీటితో ఉరలేస్తున్నాయి. దీంతో గెడ్డలు దాటండ కష్టాంగా ఉంది. ఈ పరిస్థితుల్లో గ్రామం విడిచి బయటకు వెళ్లాలంటే గిరిజనం హడలిపోతున్నారు. మత్స్యగెడ్డ పాయలపై కల్వర్టులు, వంతెనలు నిర్మాణం చేపట్టకపోవడంతో రాకపోకలు సాగించేందుకు గెడ్డ అవతల ప్రజలు అవస్థలు పడుతున్నారు. గెడ్డలు దాటి పంచాయతీ కేంద్రానికి వెళ్లి రేషన్ సరకులు, ఇతర సామగ్రి తీసుకురావాలన్నా, ఇతర పనుల నిమిత్తం గెడ్డ దాటాలన్నా ప్రాణాలకు తెగించి వెళ్లాల్సి వస్తుందని పలు గ్రామాల గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మత్స్యగెడ్డ పాలయలపై కల్వర్టులు, కాజ్‌వేలు, వంతెనలు నిర్మించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాల్సిందిగా అంతా కోరుతున్నారు.

కూటమి పాలనలో అర్హులందరికీ సంక్షేమ ఫలాలు


శుక్రపుట్టులో సంక్షేమ పథకాలను వివరిస్తున్న జీసీసీ చైర్మన్ శ్రావణ్ కుమార్

డుంబ్రిగుడ, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : సంక్షేమ ఫలాలు అర్హులందరికీ అందాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని మాజీ మంత్రి, జీసీసీ చైర్మన్ శ్రావణ్ కుమార్ అన్నారు. కించుమండ పంచాయతీ శుక్రపుట్టు గ్రామంలో సుపరిపాలనలో భాగంగా తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆయన విస్తృతంగా పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి కూటమి ఏడాది పాలనలో సాధించిన విజయాలు, ప్రవేశపెట్టిన పథకాలను వివరించారు. పలువురు వృద్ధులు, వితంతువులతో మాట్లాడి పింఛన్లు సకాలంలో అందుతున్నదీ లేనిదీ అడిగి తెలుసుకున్నారు. గ్రామానికి చెంది మహిళ పింఛన్ మంజూరు కావడం లేదని ఆయన దృష్టికి తీసుకు వెళ్లింది. దీంతో ఆయన వెంటనే ఎంపీడీవో సమస్యను వివరించి పరిష్కరించాలని సూచించారు. గత వైసీపీ ప్రభుత్వ పాలనలో అభివృద్ధి శూన్యమన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రం అన్నిరంగాల్లో అభివృద్ధి వైపు పరుగులు తీస్తున్నట్టు చెప్పారు. ప్రజలంతా తమ కూటమి ప్రభుత్వాన్ని ఆశీర్వదించాల్సిందిగా ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్య క్షుడు సుబ్బారావు, అరకు పార్లమెంట్ కోశాధికారి నాగేశ్వరరావు, టీఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి స్వామి, మాజీ సర్పంచ్ పొత్తి, యూత్ ప్రెసిడెంట్ నర్సయ్య, పాండురంగా స్వామి, త్రినాథ్, వెంకరమణరాజు తదితరులు పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయండి


వారపు సంతలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న సీఐటీయూ నేతలు

పెదబయలు, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : దేశవ్యాప్తంగా ఈ నెల తొమ్మిదో తేదీన కార్మిక సంఘాలు ఐక్యంగా నిర్వహించే సమ్మెను అంతా జయప్రదం చేయాలని పెదబయలు వారపు సంతలో సోమవారం సీఐటీయూ నేతలు విస్తృంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి వి.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ కార్మికులకు నష్టం కలిగించే నాలుగు లేబర్ కోడ్‌లను కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిందని, వాటికి అన్ని వర్గాల కార్మికులు వ్యతిరేకంగా పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. కార్మికులు అనేక పోరాటాల ద్వారా సాధించుకున్న హక్కులు, చట్టాలను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నిర్వీర్యం చేసేందుకు కంకణం కట్టుకుందని ఆరోపించారు. బడా కంపెనీలు, వ్యాపారులకు లాభాలు చేకూర్చేందుకే చట్టాల్లో మార్పులు తీసుకు వస్తుందని ఎద్దేవా చేశారు. కార్మికుల హక్కులు, చట్టాల సాధనకోసం బుధవారం జరగనున్న సమ్మెను ప్రజలంతా విజయవంతం చేయాలని కోరారు. అనంతరం ఇందుకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు రామారావు, సునీల్, ధర్మాన్నపడాల్, మంగమ్మ, రాజమ్మ తదితరులు పాల్గొన్నారు.

పెంపుడు జంతువులకు విధిగా రేబిస్ వ్యాక్సిన్ వేయించాలి

- మండల ఇన్‌చార్జి వైద్యాధికారి డాక్టర్ విజయ్ పాణిగ్రాహి


అడుగులపుట్టులో శునకానికి వ్యాక్సిన్ వేస్తున్న దృశ్యం

పెదబయలు, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెంపుడు జంతువులకు సోమవారం ఉచితంగా రేబిస్ వ్యాక్సిన్ వేసినట్టు పశు సంవర్ధక శాఖ మండల ఇన్‌చార్జి వైద్యాధికారి డాక్టర్ విజయ్ పాణిగ్రాహి తెలిపారు. 23 పంచాయతీల పరిధిలో గల గ్రామాలలో వెటర్నరీ అసిస్టెంట్ల ద్వారా 118 పెంపుడు కుక్కలకు ఈ టీకాలు వేసినట్టు చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూరేబిస్ వ్యాధి ప్రాణాంతకమైనదన్నారు. దీనిని నిర్లక్ష్యం చేయరాదని సూచించారు. ముఖ్యంగా కుక్కకాటు ద్వారా వ్యాప్తి చెందుతుందని, జంతు ప్రేమికులు అప్రమత్తంగా ఉండాలన్నారు. తమ పెంపుడు కుక్కలకు యాంటీ రేబిస్ వ్యాక్సిన్‌ను క్రమం తప్పకుండా వేయించాలని సూచించారు. అలాగే కుక్క కాటుకు గురైన వారు 24 గంటల్లోపు ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఈ టీకాలు వేయించుకోవాలన్నారు. దీనిపై ఎట్టి పరిస్థితుల్లో నిర్లక్ష్యం చేయరాదని స్పష్టం చేశారు. ఇటీవల ఉత్తరప్రదేశ్‌కు చెందిన 22 ఏళ్ల రాష్ట్రస్థాయి కబడ్డీ చాంపియన్ బ్రిజేష్ సోలంకి కుక్క కాటును నిర్లక్ష్యం చేయడంతో రేబిస్ వ్యాధితో మృతిచెందినట్టు గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో లైవ్ స్టాక్ అధికారిణి వరలక్ష్మి, వెటర్నరీ అసిస్టెంట్ పరమేష్ పాల్గొన్నారు.



సత్యవరంలో ప్రజలకు కరపత్రాలు అందించిన మంత్రి, ఎమ్మెల్యే తదితరులు

ఎన్నికల హామీలన్నీ అమలు చేస్తాం

» 'సుపరిపాలనలో తొలి అడుగు'లో మంత్రి పార్థసారథి

మాడుగుల రూరల్: ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తామని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖా మంత్రి కొలుసు పార్థసారధి చెప్పారు. మండలంలోని సత్యవరం గ్రామంలో సోమవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబుతో కలిసి ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రజలకు సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. అలాగే పథకాలు అందుతున్నాయా? లేదా? అని ఆరా తీశారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి క్లిష్టతరంగా ఉన్నప్పటికీ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఇచ్చిన మాట మేరకు సంక్షేమ పథకాలు ఒక్కొక్కటి అమలు చేస్తున్నామని మంత్రి చెప్పారు. అలాలే ఎమ్మెల్యే బండారు మాట్లాడుతూ నియోజకవర్గంలో సమస్యలు పరిష్కరించే దిశగా చర్యలు చేపడుతున్నామన్నారు. పారిశ్రామికీకరణ జరిగితే యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పుప్పాల అప్పలరాజు, అద్దిపల్లి జగ్గారావు, దేముడు, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ లాభదాయకమైన పంట

» మెగా ప్లాంటేషన్ మేళాలో ఎమ్మెల్యే రాజు



ఆయిల్‌పామ్ ప్లాంటేషన్ మేళాలో పాల్గొన్న ఎమ్మెల్యే రాజు, తదితరులు

రోలుగుంట, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం రైతులకు లాభదాయకమైన పంట ఆయిల్‌పామ్ అని ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు పేర్కొన్నారు. మండలంలోని కొవ్వూరు శివారు కె.నాయుడుపాలెంలో సోమవారం ఆయిల్‌పాం మెగా ప్లాంటేషన్ మేళాను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని రాష్ట్రాల కంటే ఆయిల్‌పామ్ సాగు చేయడానికి ఏపీ అనువైనదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఈ పంట సాగుకు రాయితీలు అందిస్తున్నదన్నారు. ప్రతీ రైతు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆయిల్‌పామ్ ఏజీఎం పట్టాభి రామిరెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం పామాయిల్ మొక్కలను శతశాతం రాయితీపై ఇస్తున్నామన్నారు. అంతర పంటలకు కూడా నాలుగేళ్ల పాటు రాయితీ ఉంటుందన్నారు. కార్యక్రమంలో సీనియర్ మేనేజర్ చంద్రశేఖర్, ఉద్యానవనశాఖ అధికారి శిరీష, ఏవో చిరంజీవి, రైతులు పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్‌లో 22 అర్జీలు

నర్సీపట్నం, జూలై 7 (ఆంధ్రజ్యోతి): సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో 22 అర్జీలు వచ్చాయి. కార్యాలయ పరిపాలన అధికారి బి.సుధాకర్, తహసీల్దార్ రామారావు వినతులను స్వీకరించారు. విశాఖపట్నం, చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ కోసం ఏపీఐఐసీ చేపట్టిన భూసేకరణలో తన ఇల్లు పోయిందని, అర్హత ఉన్నప్పటికీ ఆర్అండ్ఆర్ ప్యాకేజీలో పేరు తొలగించారని నక్కపల్లి మండలం బుచ్చిరాజుపాలెం గ్రామానికి చెందిన కాళ్ల నూకాలమ్మ ఫిర్యాదు చేశారు. జగనన్న కాలనీ కోసం 70 సెంట్ల భూమి తీసుకున్నారని, ప్రభుత్వం నుంచి నష్టపరిహారం ఇవ్వలేదని నాతవరం మండలం మన్యపుఉరట్ల గ్రామానికి చెందిన నందిక లక్ష్మి తెలిపారు. గిరిజనుల డి.పట్టా భూములను అన్నదాత సుఖీభవ జాబితాలో చేర్చాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.గోవిందరావు ఆధ్వర్యంలో గిరిజనులు రెండు చేతులు జోడించి వేడుకున్నారు.

డ్రోన్, సోలార్ వినియోగంపై రైతులకు శిక్షణ



శిక్షణ శిబిరంలో మాట్లాడుతున్న షేక్ మీరా

బుచ్చెయ్యపేట, జూలై 7 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని కేవీకే కొండెంపూడిలో రైతులకు సోలార్, డ్రోన్ వినియోగంపై సోమవారం శిక్షణ శిబిరం ప్రారంభించారు. రెండు రోజుల పాటు జరగనున్న ఈ శిబిరాన్ని అటారి జోన్ టెన్ డైరెక్టర్ షేక్ ఎన్ మీరా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించుకోవడానికి ఈ శిక్షణ ఉపయోగపడుతుందన్నారు. డ్రోన్, సోలార్ వినియోగంపై అవగాహన కల్పించి, తక్కువ పెట్టుబడి ఎక్కువ దిగుబడులు సాధించేలా రైతులకు తయారు చేస్తామని చెప్పారు. అసోసియేటెడ్ డైరెక్టర్ టాటా సిహెచ్.ముకుందరావు, ఆర్ఏఆర్ఎస్ అనకాపల్లి శాస్త్రవేత్తలకు రైతుల సమస్యలకు పరిష్కార మార్గాలను సూచించారు. ఆచార్య ఎన్‌జిరంగా విశ్వ విద్యాలయం ఉప విస్తరణ సంచాలకులు బి.ముకుందరావు ఆధునిక విస్తరణ చేపట్టే విధానాలను వివరించారు. ఈ కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్త రాజ్‌కుమార్, ఉన్నత పర్వత శ్రేణి జోన్, ఉత్తర కోస్తా, గోదావరి జిల్లాల నుంచి శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు



బీజామృతం ద్వారా విత్తన శుద్ధి చేయడంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

నర్సీపట్నం అర్బన్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టిసారించి అధిక దిగుబడులను సాధించాలని వేములపూడి-1 ఎంపీటీసీ సభ్యుడు బోళెం రామ్‌ప్రసాద్ పేర్కొన్నారు. వేములపూడి గ్రామంలో ప్రకృతి వ్యవసాయంలో బీజామృతం తయారీపై 20 మంది రైతులకు సోమవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. రైతులతో బీజామృతం ద్వారా విత్తన శుద్ధి చేసి, విత్తనాలు వేయించడంపై శిక్షణ ఇచ్చారు. విత్తన శుద్ధి తప్పనిసరిగా చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ యూనిట్ ఇన్‌చార్జి రమ, సిబ్బంది రామకృష్ణ, సురేశ్, సురేఖ తదితరులు పాల్గొన్నారు.

శక్తి యాప్‌పై అవగాహన సదస్సు

నర్సీపట్నం అర్బన్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ఎరకన్నపాలెంలో శక్తి యాప్, సైబర్ నేరాలపై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. శక్తి యాప్ ఉపయోగాలపై సీఐ రేవతమ్మ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గంజాయి వినియోగం వల్ల వ్యక్తిగత జీవితాలు నాశనమయ్యే ప్రమాదం ఉందన్నారు. గ్రామాలను గంజాయి వంటి మత్తు పదార్థాల నుంచి పూర్తిగా విముక్తి కల్పించడానికి కృషి చేయాలని సీఐ సూచించారు.

రహదారిద్ర్యం.. నరకప్రాయం!

అస్తవ్యస్తంగా గ్రామీణ రహదారులు

బురదమయమైన రాజాం-తురకలపూడి మార్గం

వర్షాలకు తారు కొట్టుకుపోయిన వైబీపట్నం-లోసింగి రోడ్డు

ప్రయాణికులు, వాహన చోదకుల పడరాని పాట్లు

పట్టించుకోని అధికారులు, ప్రజా ప్రతినిధులు

గ్రామీణ రహదారులు దారుణంగా మారాయి. వర్షాలకు అస్తవ్యస్తంగా తయారయ్యాయి. మట్టి మార్గాలు బురదమయమయ్యాయి. పలు చోట్ల తారు రోడ్లు కొట్టుకుపోయాయి. వీటిని పట్టించుకునే నాథులు లేకపోవడంతో వాహన చోదకులు, ప్రయాణికులకు నరకం చూపిస్తున్నాయి.

బుచ్చెయ్యపేట జూలై 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజాం-తురకలపూడి రోడ్డు వాహన చోదకులకు నరకప్రాయంగా మారింది. రోడ్డంతా గోతులతో నిండిపోయింది. ఏ మాత్రం వర్షం కురిసినా గోతుల్లో నీరు నిల్వ చేరి చెరువులను తలపిస్తున్నాయి. అలాగే ఈ మార్గం రాజాం, తైపురం, చిట్టియ్యపాలెం వద్ద మరీ అధ్వానంగా మారింది. గోతుల్లో నీరు చేయడంతో వాహనచోదుకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం వల్లే రోడ్డు ఈ దుస్థితికి చేరిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అలాగే కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది గడుస్తున్నా కనీసం మరమ్మతులకు నోచుకోలేదు. వేసవి కాలంలో మరమ్మతులు పూర్తికాలేదు. వర్షాకాలం కావడంతో మరింత ఆలస్యమవుతున్నాయని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

ఈ మార్గంలో రావికమతం, బుచ్చెయ్యపేట మండలాలకు చెందిన భవన నిర్మాణ కార్మికులు కూలీలు, విద్యార్థులు, ఉద్యోగులు ఉదయం అనకాపల్లి పట్టణంలోని పనులకు వెళ్లారు. చీకటి పడిన తరువాత తిరిగి సొంత ప్రాంతాలకు వస్తుంటారు. ఈ క్రమంలో రాత్రి వేళ రోడ్డులో



చిట్టియ్యపాలెం వద్ద బురదమయమైన రాజాం-తురకలపూడి రోడ్డు

గోతులు కనిపించకపోవడంతో కూలీలు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు, పాలకులు స్పందించి ఈ రోడ్డు అభివృద్ధికి తక్షణమే తగిన చర్యలు తీసుకోవాలని ఈ ప్రాంత వాసులు, వాహన చోదకులు కోరుతున్నారు.

తారు కొట్టుకుపోయిన వైబీపట్నం-లోసింగి రోడ్డు

రోలుగుంట: మండలంలోని అర్ల, ఎంకేపట్నం పంచాయతీ కొండ శిఖర ఆదివాసీ గిరిజన గ్రామాలకు రోడ్డు నిర్మాణం అసంపూర్తిగా నిలిచిపోవడంతో గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వైబీపట్నం నుంచి లోసింగి మీదుగా పెదగరువు వరకు రూ.2.6 కోట్లు, అర్ల నుంచి పిత్రిగెడ్డ వయా జాజుల బంద వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.4.6 కోట్లు ఉపాధి హామీ పథకం ద్వారా నిధులు, ఎంకేపట్నం నుంచి కొరుప్రోలు వరకు ఇతర గ్రాంట్ల నుంచి రూ.2.5 కోట్ల నిధులను ప్రభుత్వం మంజూరు చేసింది. ఆయా గ్రామాల్లో గత మార్చిలో ఎర్త్ వర్క్ పూర్తి గ్రావెల్ పనులు పూర్తి చేశారు. అనంతరం నిధులు మంజూరు చేయకపోవడంతో పనులను మధ్యలోనే ఆపేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు ఆయా రోడ్లు కొట్టుకుపోయాయి. వాహనాలు వెళ్లకపోవడంతో గిరిజనులు ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. రోగులు, గర్భిణులను అత్యవసర సమయంలో డోలీ మోతలతో ఆస్పత్రికి తీసుకువెళ్లాల్సి వస్తోందని వాపోతున్నారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి నిధులు మంజూరు రోడ్ల పనులు పూర్తి చేయాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కె.గోవిందరావు కోరుతున్నారు. లేకుంటే కలెక్టర్ కార్యాలయం ఎదుట గిరిజనులతో ఆందోళన కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు.



ఇటీవల కురిసిన వర్షాలకుతారు కొట్టుకుపోయి దారుణంగా తయారైన వైబీపట్నం-లోసింగి రోడ్డు

తాగునీటి సమస్యను పట్టించుకోరా..?

» ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులపై ఎంపీపీ ఆగ్రహం

» వాడీవేడిగా మండల సర్వసభ్య సమావేశం

మాకవరపాలెం, జూలై 7 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో తాగునీటి సమస్యను పట్టించుకోరా..? అని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులపై ఎంపీపీ రుత్తల సర్వేశ్వరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపీపీ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముందుగా వ్యవసాయ అధికారి అప్పారావు మాట్లాడుతూ ఈ ఏడాది పూర్తి స్థాయిలో వరి విత్తనాలు పంపిణీ చేశామన్నారు. అనంతరం ఆర్‌డబ్ల్యూఎస్ ఇన్‌చార్జి జేఈ తాగునీటి సమస్యపై మాట్లాడుతుండగా ఎంపీపీ అడ్డు తగిలారు. గ్రామాల్లో తాగునీటి సమస్యపై పలుమార్లు చెప్పినా ఎందుకు పట్టించుకోలేదని నిలదీశారు. ఈ సమస్య పరిష్కారం చేయకుండా సమావేశంలో మాట్లాడడం ఎందుకు అని ప్రశ్నించారు. ఇప్పటికే బూరుగుపాలెం గ్రామంలో రెండు రోజులకు ఒకసారి కుళాయిల నీరు వస్తున్నదని, మాకవరపాలెంలో కుడా తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని జేఈపై మండిపడ్డారు. అనంతరం బోడ్డెపల్లి ఎంఈసీ ఛైర్మన్ గవిరెడ్డి వెంకటరమణ మాట్లాడుతూ మార్కెట్ యార్డులో ఈ నెల 11న వ్యవసాయ యాంత్రీకరణ పరికరాల మేళా జరుగుతుందని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. విద్యుత్ శాఖ జేఈ నాగభూషణం మాట్లాడుతూ మండలంలో ఇప్పటివరకు 900 విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేశామని చెప్పారు. అలాగే పొలాలకు విద్యుత్ లైన్ల ఏర్పాటుకు 175 మంది రైతులు



మండల సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ జేఈపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎంపీపీ

దరఖాస్తు చేయగా, ఇప్పటికే 55 మంది రైతులకు విద్యుత్ లైన్లు వేశామన్నారు. అలాగే కొత్తపాలెం పునరావాస కాలనీలో నకిలీ ఇంటి పట్టాలపై విచారణ జరిపి న్యాయం చేయాలని రాచపల్లి ఎంపీటీసీ సభ్యుడు ఆర్‌వై.యర్రాపాత్రుడు కోరారు. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు అధికారుల కృషి ఎంతో అవసరమని శెట్టిపాలెం సర్పంచ్ అల్లురామునాయుడు చెప్పారు. ఎరకన్నపాలెం గ్రామంలోని ప్రభుత్వ భూమిలో ప్రైవేటు కంపెనీల ఏర్పాటుకు రెవెన్యూ కసరత్తు చేస్తున్నారని, పారిశ్రామికంగా ఈ ప్రాంతం అభివృద్ధికి అందరూ కృషి చేయాలని తహసీల్దార్ వెంకటరమణ కోరారు. చామంతిపురానికి రేషన్ డిపో మంజూరు చేయాలని సర్పంచ్ గోవింద కోరారు. సమావేశంలో ఎంపీడీవో చాయిసుధ, జడ్పీటీసీ సభ్యురాలు సత్యవేణి, ఏఎంసీ ఛైర్మన్ జి.వెంకటరమణ పాల్గొన్నారు.

కొత్తకోట-జడ్.కొత్తపట్నం రోడ్డుకు మోక్షం

» ఎమ్మెల్యే చొరవతో రూ.70 లక్షలు మంజూరు

» ఎన్నో ఏళ్ల రోడ్డు సమస్యకు పరిష్కారం

» మూడు పంచాయతీల ప్రజల హర్షం

రావికమతం, జూలై 7 (ఆంధ్రజ్యోతి): కొత్తకోట-జెడ్.కొత్తపట్నం రోడ్డుకు ఎట్టకేలకు మోక్షం లభించింది. మూడు పంచాయతీలకు చెందిన 30 గ్రామాల ప్రజలు ఎదుర్కొంటున్న రోడ్డు ఇబ్బందులను గుర్తించిన ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు చొరవ చూపి ఈ రోడట అభివృద్ధికి రూ.70 లక్షల నిధులు మంజూరు చేశారు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కొత్తకోట నుంచి జెడ్.కొత్తపట్నం రోడ్డు కిలోమీటరున్నర మేర కల్యాణపులోవ కాలువ గట్టును ఆనుకుని ఉంది. ఈ రోడ్డు చీమలపాడు, జెడ్.కొత్తపట్నం, గంపవానిపాలెం పంచాయతీల పరిధిలో సుమారు 30 గ్రామాల ప్రజల రాకపోకలకు ఎంతో ఉపయోగంగా ఉంటుంది. సుమారు 25 ఏళ్లుగా ఈ రోడ్డు అభివృద్ధికి నోచుకోలేదు. దీంతో రోడ్డు అడుగడుగునా ధ్వంసమై అధ్వానంగా తయారై రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. దీంతో రోడ్డు అభివృద్ధి చేయాలని ఈ ప్రాంత ప్రజలు ఎన్నో ఏళ్లుగా విజ్ఞప్తులు చేస్తున్న ఫలితం లేకపోయింది. ఎట్టకేలకు ఎమ్మెల్యే రాజు ఈ రోడ్డు అభివృద్ధికి నిధులు



రోడ్డును పరిశీలిస్తున్న ఇంజనీరింగ్ అధికారులు, టీడీపీ నాయకులు

మంజూరు చేయించడంతో సోమవారం పీఆర్ ప్రాజెక్టు డీఈఈ హరి, ఏఈ శ్రీనివాస్ రోడ్డును పరిశీలించారు. టెండర్ కూడ ఖరారు కావడంతో త్వరలోనే రోడ్డు అభివృద్ధి పనులు ప్రారంభమవుతాయని ఈ సందర్భంగా డీఈ తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ఆర్.కొండనాయుడు, నాయ కులు బంటు శ్రీనివాస్‌రావు, ఉగ్గిన శ్రీను, తాతాజీ పాల్గొన్నారు.

డీసీసీబీ బ్రాంచిలో రూ.2.58 కోట్ల రుణాలు

» సీఈవో డీవీఎస్ వర్మ

మాడుగుల, జూలై 7 (ఆంధ్రజ్యోతి): మాడుగుల డీసీసీబీ బ్రాంచి పరిధిలో రూ.2.58 కోట్ల రుణాలు అందించడం జరిందని సీఈవో డీవీఎస్ వర్మ తెలిపారు. సోమవారం మాడుగుల వచ్చిన ఆయన విలేఖరులతో మాట్లాడారు. మాడుగుల సెంట్రల్ బ్యాంక్ పరిధిలో 87 మందికి వ్యవసాయ రుణాలు కింద రూ.75 లక్షల 12 వేలు మంజూరు చేసినట్టు చెప్పారు. అదే విధంగా 27 మందికి మార్టుగేజ్ రుణాల కింద రూ.1.11 కోట్లు మంజూరు చేసి చెక్కులు అందించడం జరిగిందన్నారు. ఆరు డ్వాక్రా గ్రూపులకు సంబంధించి రూ.72 లక్షలు మంజూరు చేశామని తెలిపారు. కె.కోటపాడు మండలానికి చెందిన ఆరుగురికి ఒక లక్షా ఐదువేల రూపాయలు జీవిత బీమా సొమ్ము చెక్కును పంపిణీ చేశామన్నారు. ఆయన వెంట డీసీసీబీ అధికారులు అన్నపూర్ణ, శ్రీనివాసరావు, కో ఆపరేటివ్ సొసైటీ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

డాక్టర్ బదిలీతో పశు వైద్య సేవలు దూరం



మూసి ఉన్న పశువుల ఆసుపత్రి

బుచ్చెయ్యపేట జూలై 7 (ఆంధ్రజ్యోతి): మండలంలో వడ్డాదిలో పశు వైద్యాధికారి బదిలీతో పశు వైద్య సేవలు దూరమయ్యాయి. ఇక్కడి ఆస్పత్రిలో పనిచేసిన డాక్టర్ వాత్సవ్యను బదిలీ కాగా, అధికారులువేరొకరిని నియమించలేదు. దీంతో మూడు వారాలుగా పశు వైద్య సేవలు అందని పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుతం ఆసుపత్రి అటెండర్ పశువుల చిన్న చిన్న వ్యాధులకు సేవలు అందిస్తున్నారు. కుముందానిపేట, మంగళాపురం, విజయరామరాజుపేట, వడ్డాది, ఎల్ బీపురం, బంగారుమెట్ట, ఎల్ సింగవరం, లోపూడి, పొట్టిదొరపాలెం, గంటికొర్లం, కొమ్మలపూడి, బుదిరెడ్లపాలెం తదితర గ్రామాల పాడి రైతులకు ఈ పశువుల ఆస్పత్రే ఆధారం. ప్రస్తుతం గొర్రెలు, మేకలు, పాడి పశువులకు అందకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. తక్షణమే పశు వైద్యాధికారిని నియమించాలని వారు కోరుతున్నారు.

టీడీపీ నేత అచ్చిరాజు పాడె మోసిన స్పీకర్



అచ్చిరాజు పాడె మోస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు... ఇన్‌సెట్‌లో అచ్చిరాజు (ఫైల్)

నాతవరం, జూలై 7 (ఆంధ్రజ్యోతి): టీడీపీ నాయకుడు, నర్సీపట్నం మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ లాలం అచ్చిరాజు (అబ్బారావు) పాడెను స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు మోశారు. అచ్చిరాజు ఆదివారం మృతి చెందిన విషయం తెలిసిందే. దీంతో నాతవరం మండలం వెన్నలపాలెంలో అచ్చిరాజు పార్థివదేహానికి స్పీకర్ అయ్యన్నపాత్రుడు, పద్మావతి దంపతులు నివాళులు అర్పించారు. అనంతరం అయ్యన్నపాత్రుడు అచ్చిరాజు అంత్యక్రియలలో పాల్గొని పాడెమోసి శ్మశానానికి తీసుకెళ్ళి పార్టీకి అచ్చిరాజు చేసిన రుణం తీర్చుకున్నారు. అచ్చిరాజు కుటుంబ సభ్యులను అయ్యన్నపాత్రుడు ఓదార్చి ధైర్యం చెప్పారు ఈ సందర్భంగా అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ అచ్చిరాజు టీడీపీ ఆవిర్భావం నుంచి కొనసాగుతూ పార్టీ అభివృద్ధికి అహర్నిశలు శ్రమించారని పేర్కొన్నారు. ఎప్పుడూ పార్టీ గురించే ఆలోచించే అచ్చిరాజు మృతి వ్యక్తిగతంగా తనకు, టీడీపీకి తీరని లోటని పేర్కొన్నారు. అచ్చిరాజు అంత్యక్రియలలో టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్, నర్సీపట్నం కౌన్సిలర్ రాజేశ్, జనసేన ఇన్‌చార్జి వీరసూర్యచంద్ర, తాండవ ప్రాజెక్టుకమిటీ ఛైర్మన్ కె.సత్యనారాయణ, టీడీపీతో పాటు పలు పార్టీ నాయకులు లాలం కాశీనాయుడు, శ్రీరంగస్వామి, ఎ.నానిబాబు, ఎస్.వెంకటరమణ, ఎస్.విజయ్‌కుమార్, పి.కొండబాబు, ఎస్.సన్యాసిదేముడు, ఎ.చిన్నయ్యనాయుడు, సీతారామ్మూర్తి పాల్గొన్నారు.

బాలిక అదృశ్యంపై పోలీసులకు ఫిర్యాదు

విశాఖపట్నం, జూలై 7 (ఆంధ్రజ్యోతి): నర్సీపట్నం పెదబోడెపల్లి ఎస్సీ కాలనీకి చెందిన బాలిక అదృశ్యమైనట్టు ఎంవీపీ పోలీసులు కేసు నమోదు చేశారు. బాలిక (17) నగరంలోని బోయపాలెం వద్ద ఓ కళాశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. అనారోగ్యం కారణంగా గత నెల 30న ఉషోదయ కూడలిలో ఉంటున్న తన పిన్ని ఇంటికి వచ్చింది. ఈ నెల 4న రాత్రి 8.30 గంటలకు ఆమె బయటకు వెళ్లి తిరిగి రాలేదు. అన్ని చోట్ల వెతికినా ఆచూకీ లభించకపోవడంతో బాలిక తల్లి ఫిర్యాదు చేశారు.

పారిశుధ్య సమస్య పరిష్కరించండి

నర్సీపట్నం, జూలై 7 (ఆంధ్రజ్యోతి): పెదబొడ్డేపల్లి కూరగాయల మార్కెట్‌లో చెత్తా చెదారం, మురుగు పేరుకుపోయి పారిశుధ్యం లోపిస్తున్నదని, ఈ సమస్యను పరిష్కరించాలని ఏఎంసీ ఛైర్మన్ గవిరెడ్డి రమణ దృష్టికి జనసేన పట్టణ నాయకులు తీసుకు వచ్చారు. పందులు, కుక్కలు మార్కెట్లో సంచరిస్తూ వాతావరణాన్ని పాడు చేస్తున్నాయని తెలిపారు. మార్కెట్‌ను శుభ్రం చేయించి సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు అద్దెపల్లి గణేశ్, మారిశెట్టి రాజా తదితరులు పాల్గొన్నారు.

మలేరియాపై అప్రమత్తత అవసరం

గొలుగొండ, జూలై 7 (ఆంధ్రజ్యోతి): మలేరియాపై అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి శ్యామ్‌కుమార్ స్పష్టం చేశారు. మండలంలోని జోగంపేట, గొలుగొండ, శ్రీరాంపురం గ్రామాల్లో మలేరియా మాసోత్సవాల్లో భాగంగా సోమవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాల సీజన్ కావడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. పరిసర ప్రాంతాల్లో వర్షపు నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని చెప్పారు. అనంతరం జోగంపేట గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌వీ ప్రసాద్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పేరెంట్స్ సమావేశం జయప్రదం చేయాలి

గొలుగొండ, జూలై 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఈ నెల 10వ తేదీన నిర్వహించే పేరెంట్స్ సమావేశం విజయవంతం చేయాలని ఎంఈవో మూర్తి సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ప్రధానోపాధ్యాయులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో పేరెంట్స్ సమావేశంలో ప్రతీ విద్యార్థి తల్లిదండ్రులు పాల్గొనేలా చర్యలు చేపట్టాలన్నారు. అలాగే ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివరించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మేరీ రోజీ, తహసీల్దార్ శ్రీనివాసరావు, ఎంఈవో-1 సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

అన్నసమారాధన రేపు

చోడవరం, జూలై 7 (ఆంధ్రజ్యోతి): సింహాచలం నరసంహస్వామి గిరి ప్రదక్షిణ సందర్భంగా మండలంలోని గజపతినగరం ఆధ్వర్యంలో విశాఖ సింహాచలం దరి కొత్త గోశాల వద్ద గిరి ప్రదక్షిణ చేసే భక్తుల కోసం భారీ అన్నసమారాధన నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రతి ఏటా గిరిప్రదక్షిణకు గజపతినగరం గ్రామస్థులంతా స్వచ్ఛందంగా ముందుకు వచ్చి భక్తులకు భోజనాలు, ప్రసాదాలు సరఫరా చేయడం ఆనవాయితీ. ఈ ఏడాది ప్రదక్షిణకు సైతం తమ గ్రామం తరపున భోజనాలు, ప్రసాదాల సరఫరాకు సిద్ధంగా ఉన్నట్టు గజపతినగరం గ్రామస్థులు తెలిపారు.

భూముల రికార్డులు ఆన్‌లైన్ చేయరూ..

కె.కోటపాడు, జూలై 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అనేక గ్రామాల్లో వ్యవసాయ భూములు రీసర్వే పూర్తయినా ఆన్‌లైన్ చేయకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని సీపీఐ మండల కార్యదర్శి గొర్లె దేవుడు బాబు ఆరోపించారు. ఈ మేరకు పీజీఆర్ఎస్ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌కు సోమవారం అర్జీ అందించారు. కింతాడ, దాలివలస, కె.సంతపాలెం, ఆర్లే తదితర గ్రామాల్లో భూములు రీ సర్వే నిర్వహించి ఏడాదైనా రికార్డులు ఆన్‌లైన్ చేయలేదన్నారు. దీనివల్ల ప్రభుత్వం అందిస్తున్న రైతుబంధు బ్యాంక్ రుణాలు, ఎరువులు, విత్తనాలు తదితర పథకాలకు నోచుకోలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే భూములు క్రయ విక్రయాలు కూడా నిలిచిపోవడంతో అత్యవసరమైన రైతులు ఇబ్బందులకు గురవుతున్నారని వాపోయారు. ఆయా గ్రామాల్లో తక్షణమే వ్యవసాయ భూముల రికార్డులను ఆన్‌లైన్ చేయాలని ఆయన కోరారు.

పచ్చి మేతతో పశువులకు ఆరోగ్యం

» పశు వైద్యాధికారిణి గాయత్రీదేవి

దేవరాపల్లి, జూలై 7 (ఆంధ్రజ్యోతి): పచ్చి మేతలో విటమిన్-ఎ అధికంగా ఉండడం వల్ల పశువులు ఆరోగ్యంగా ఉంటాయని పశు వైద్యాధికారిణి జి.గాయత్రీ దేవి చెప్పారు. మండలంలోని దేవరాపల్లి, మామిడిపల్లి, ఎం.అలమండ గ్రామాల్లో ఆయా పశు వైద్యాధికారులు సోమవారం పశుగ్రాస వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా పశుగ్రాసంపై రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం డాక్టర్ గాయత్రీదేవి మాట్లాడుతూ పచ్చి మేత వల్ల పశువులు సకాలంలో ఎదకు వస్తాయన్నారు. ఈ నెల 14 వరకు వారోత్సవాలు జరుగుతాయన్నారు. రైతు సేవా కేంద్రంలో కూడా పశుగ్రాసం పెంచే విధానం, శాస్త్రీయ పద్ధతిలో నిల్వ చేసుకొనే అవకాశాలపై రైతులకు అవగాహన కల్పిస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమాల్లో పశు వైద్యాధికారులు మంజుషారాణి, జి.ప్రియాంక, సిబ్బంది సురేశ్, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

చికాకు పెట్టే అలర్జీలు



అలర్జీ... చికాకు పెట్టే రుగ్మత. ఎక్కువమందిలో సాధారణంగా కనిపించే సమస్య. వాసన, దుమ్ము, ధూళి, ఆహారం... ఇలా ఎన్నో అంశాలు దీనికి కారణం. ఈ సమస్యతో ఏళ్లుగా బాధపడుతున్న వారు కూడా గుర్తించలేరు. శరీరంపై దురద, పొక్కులతో ఇబ్బందులు పడుతున్నా కారణం తెలియక అల్లాడుతుంటారు. ప్రాణాంతకం కాకున్నా ఇది ప్రమాదకరమైన సమస్యేనని, అవగాహన తప్పనిసరని వైద్య నిపుణులు చెబుతున్నారు.

శారీరకంగా ఎన్నో ఇబ్బందులు

- గాలి, ఆహారం, డ్రగ్స్ తదితర కారణాలు
- కాలుష్యంతోనూ తీవ్రమయ్యే సమస్య
- ఇటీవల పెరుగుతున్న బాధితుల సంఖ్య
- నేడు అంతర్జాతీయ అలర్జీ డే

(విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి)

పీల్చేగాలి, తాగేనీరు, తీసుకునే ఆహారం తదితరాల్లోని ప్రతికూల అంశాలకు శరీరం స్పందిస్తుంది. దీనినే అలర్జీ అంటారు. ఇది చేసేపనిపై ధ్యాసపెట్టలేనంతగా చికాకుపెడుతుంది. కాలుష్య సమస్య పెరిగాక అలర్జీ బాధితుల సంఖ్య గణనీయంగా పెరిగింది. ఈ నేపథ్యంలో అలర్జీపట్ల ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఏటా జూలై 8న 'ఫిలిప్పీన్ సొసైటీ ఆఫ్ అలర్జీ' అంతర్జాతీయ అలర్జీ డేను నిర్వహిస్తోంది.

ధూళి నుంచి పుప్పొడి రేణువులవరకు... వాతావరణంలో దుమ్ము, ధూళి కాలుష్యం కారణంగా కొంత మందిలో అలర్జీ కనిపిస్తుంది. కొందరికి చల్లని గాలులు, మరికొంత మందికి పూలపై ఉండే పుప్పొడి రేణువులు, ఇంకొందరికి గాలిలో ఎగిరే చిన్నగుడ్లు, సూక్ష్మక్రిముల వల్ల అలర్జీ వస్తుంది. ముక్కు ప్రవేశించే క్రమంలో అక్కడ అడ్డుకునే రక్షణ వ్యవస్థ పనిచేస్తుంది. ఈ సమయంలోనే తుమ్ములు వస్తాయి. దాంతో ముక్కు ముందు భాగంలో వాపు, ఎర్రగా మారడం, నీరుకారుతుంది.

ఆయా పదార్థాలు లోపలికి ప్రవేశిస్తే ఆయాసం రూపంలో అలర్జీ బయటపడుతుంది. శరీరంలో రక్షణ వ్యవస్థ బలహీనమైతే ఇవి ఊపిరితిత్తులపైనా దాడిచేస్తాయి.

ఇవీ కారణాలు



వస్తువులు, జంతువులు, వాయువుల కారణంగా అలర్జీ రావచ్చు. దీనిని పూర్తిగా నివారించే మందులు లేవు. పర్యావరణ సమతుల్యం దెబ్బతినడం వల్ల కాలుష్యం పెరిగి అలర్జీ సమస్యలు తలెత్తుతున్నాయి. బాధితుల్లో భిన్న లక్షణాలు కనిపిస్తాయి.



చర్మ అలర్జీ

చర్మ సంబంధిత అలర్జీ చిన్నారుల్లో ఎక్కువ. కొన్నిరకాల మందులు, ఆహార పదార్థాలు పడకపోవడం వల్ల చర్మంపై దురద, దద్దుర్లు, ఎరుపెక్కడం కనిపిస్తాయి. ఇవి కొన్ని నిమిషాలు నుంచి గంటల వరకు ఉంటాయి.

జీర్ణకోశ అలర్జీ

కొంతమందికి కొన్ని ఆహార పదార్థాలు పడకపోవడం వల్ల జీర్ణకోశ అలర్జీలు వేధిస్తాయి. వికారం, వాంతులు, నీరసం, మలబద్ధకం, విరోచనాల సమస్యలు తలెత్తుతాయి

చర్మం...ముక్కు అలర్జీలు

అలర్జీల్లో అత్యధికం చర్మం, ముక్కు (రైనటిస్) అలర్జీలే. ఆరుశాతం ఆహారం, సుమారు 18 శాతం వరకు ఆస్తమాకు సంబంధించినవి మిగిలినవన్నీ ఇతర రకాల అలర్జీలు. అలర్జీకి చికిత్స లేదు. శరీరానికి పడని వాటికి దూరంగా ఉండడమే ఉత్తమం. దేని వల్ల అలర్జీ వస్తుందో గుర్తించి వాటిని దరిచేరనీయకూడదు. చల్లగాలి పడనివారు బయటకు వెళ్తే ముఖానికి స్కార్ఫ్ కట్టుకోవాలి, ఎండపడనివారు ఎండ తగలకుండా ఏర్పాట్లు చేసుకోవాలి. రంగులు, సెంట్ల వాసనలు పడనివారు వాటికి దూరంగా ఉండాలి. పడని ఆహారం తీసుకోవడం మానేయాలి.

జంతువుల వల్ల

కొందరికి పెంపుడు జంతువులవల్ల అలర్జీలు వస్తాయి. వాటిని సరిగా శుభ్రం చేయకపోయినా, వాటి వెంట్రుకల్లోని రేణువులు గాలిలో కలిసి, మనం పీల్చినప్పుడు అలర్జీల బారిన పడతారు. దుప్పట్లు, దిండ్లు, గలేబులు ఎప్పటికప్పుడు శుభ్రం చేయకపోతే క్రిములు ముక్కు, నోటి ద్వారా శరీరంలోకి ప్రవేశించి అలర్జీ సమస్య సృష్టిస్తాయి.

పెరుగుతున్న బాధితుల సంఖ్య



వివిధ రకాల అలర్జీలతో బాధపడుతున్న వారి సంఖ్య ఇటీవల పెరుగుతోంది. ఒక సంస్థ 30 దేశాల్లో నిర్వహించిన సర్వే ప్రకారం 50 శాతం మంది ప్రజలు చర్మ, కంటి, ఇతర అలర్జీలతో బాధపడుతున్నట్టు తేలింది. లంగ్స్, సైనస్ అలర్జీ (ఆస్తమా, బ్రాంకైటిస్) మన ప్రాంతంలో కనిపిస్తున్నాయి. దీనికి ప్రత్యేకంగా వైద్యం ఉండదు. కారణాన్ని గుర్తించి, వాటికి దూరంగా ఉండడం, జాగ్రత్తలు తీసుకోవడమే. పిల్లల్లో చైల్డ్‌హుడ్ ఆస్తమా కనిపిస్తుంది. తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి. ఐదారేళ్ల తరువాత క్రమంగా తగ్గుముఖం పడుతుంది.

- డాక్టర్ ఎస్ఎన్ఆర్ నవీన్, జనరల్ మెడిసిన్ వైద్య నిపుణులు, కేజీహెచ్

రోడ్లు, వంతెనల పనులు పూర్తిచేయాలి

- సీఎం చంద్రబాబుకు ఎంపీ రమేశ్ వినతి



సీఎం చంద్రబాబుకు వినతిప్రతం అందిస్తున్న ఎంపీ రమేశ్

అనకాపల్లి, జూలై 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అసంపూర్తిగా నిలిచిపోయిన రోడ్లు, వంతెన పనులను త్వరిత గతిన పూర్తిచేయాలని కోరుతూ ఎంపీ సీఎం.రమేశ్ కోరారు. ఈ మేరకు సోమవారం అమరావతిలో ముఖ్య మంత్రి నారా చంద్రబాబునాయుడును కలిసి వినతిపత్రం అందిం చారు. జిల్లాలో అధ్వాన రోడ్లు, వంతెనల పరిస్థితిని సీఎంకు వివరించారు. రోడ్ల దుస్థితిపై పూర్తి వివరాలతో సీఎంకు వినతిపత్రాన్ని అందజేశారు. జిల్లా పారిశ్రామికంగా, పర్యాటకంగా అభివృద్ధి చెందాలంటే రోడ్ల కనెక్టివిటీ అవసరమని లేఖలో పేర్కొన్నారు. వడ్డాది గ్రామంలో పెద్దేరుపై హై లెవెల్ వంతెన నిర్మాణం చేపట్టాలని, నర్సీపట్నం నుంచి రేవుపోలవరం రోడ్డు పనులు, వరహా నదిపై హై లెవెల్ వంతెన పనులు చేపట్టాల్సిన అవసరం ఉం దని సీఎంకు తెలిపారు. దీంతో పాటు జిల్లాలో అసంపూర్తిగా ఉన్న బీఎన్ రోడ్డు, ఇతర పనులను పూర్తి చేయాలని ఎంపీ రమేశ్ కోరారు.

కోనాం వైపు కన్నెత్తి చూడరే?

... 5వ పేజీ తరువాయి



పూర్తిగా శిథిలమైన సిబ్బంది గృహాలు

సాగునీరు అందించేందుకు గాను దిగువ కాలువకు రెండు గేట్లు, ఎగువ కాలువకు ఒక గేటు ఏర్పాటు చేశారు. 15 సంవత్సరాలుగా దిగువ కాలువ గేట్లకు అమర్చిన రబ్బరు తొడుగులు పనిచేయకపోవడంతో అధికారులు పూర్తిగా గేట్లు మూసినా దిగువ గేట్లు ద్వారా ప్రతి రోజు 50 క్యూసెక్కులకు పైగా సాగునీరు వృథాగా పోతోంది. కోనాం బోగొండమ్మ దేవాలయం నుంచి మెయిన్ గేట్ల ద్వారా సుమారు కిలోమీటరు మేర ఉన్న జలాశయం గట్టు వర్షాకాలంలో పూర్తిగా బురదమయంగా ఉండగా, కోనాం మెయిన్‌రోడ్డు నుంచి జలాశయానికి వచ్చే అధికారులు, రైతుల కోసం ఏర్పాటు చేసిన రోడ్డు సైతం రాళ్లుతేలి ఉంది. దీంతో పర్యాటకులు, అధికారులు ఇక్కడికి రావడానికి ఇబ్బందులు పడుతున్నారు. కోనాం జలాశయం సమస్యల పరిష్కారానికి కోటి రూపాయలు మంజూరు చేశామని ఆరు నెలల కిందట ప్రజాప్రతినిధులు ప్రకటించారని, ఆ నిధులు ఏమయ్యాయో రైతులకు వివరించాలని సీడీసీ చైర్మన్ సుంకరి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. జలాశయం ప్రాజెక్టు కమిటీ ఏర్పాటు చేసి ఆరు నెలలు గడిచినా కనీసం ఒక్క సమావేశం కూడా ఏర్పాటు చేయలేదని మర్లగుమ్మి ఆనకట్టు, దిబ్బపాలెం చానల్ సాగునీటి సంఘం అధ్యక్షుడు దారపు మండేలు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి కోనాం జలాశయం సమస్యలను పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు.

గేట్లు ఏర్పాటుకు నిధులు మంజూరు

- సీహెచ్ జయరాంపడాల్, ఇరిగేషన్ ఏఈ, కోనాం

కోనాం జలాశయంలో నెలకొన్న కొన్ని సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం కోటి రూపాయలు మంజూరు చేసింది. స్పిల్‌వే గేటు, జనరేటర్ రూమ్, ప్లాట్‌ఫారం, రోప్స్, మెకానిక్ పార్ట్స్ ఏర్పాటు చేయడానికి ఈ నిధులు మంజూరయ్యాయి. టెండర్లు పూర్తయిన వెంటనే పనులు ప్రారంభిస్తాం.

20 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తాం



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పార్థసారథి



మోదకొండమ్మను దర్శించుకుంటున్న మంత్రి, ఎమ్మెల్యే

- ఇంటికో పారిశ్రామికవేత్తను తయారు చేయడమే సీఎం లక్ష్యం
- ఏపీకి పరిశ్రమలు, పెట్టుబడులతో నిరుద్యోగులకు ఆసరా
- రాష్ట్ర గృహ నిర్మాణ శాఖా మంత్రి కొలుసు పార్థసారథి

మాడుగుల, జూలై 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఐదేళ్ల కాలంలో 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖా మంత్రి కొలుసు పార్థసారథి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని టీటీడీ కల్యాణ మండపంలో సోమవారం జరిగిన డీసీసీబీ రుణాల పంపిణీ కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి జరిగిన అధ్యక్షతన జరిగిన సభలో ఆయన ప్రసంగించారు. రాష్ట్ర ఉన్నత భవిష్యత్తు కోసం సీఎం చంద్రబాబునాయుడు తీసుకున్న నిర్ణయానికి డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అండగా నిలుస్తున్నారని, పీఎం మోదీ ఆశీస్సులు కూడా ఉన్నాయని చెప్పారు. వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని రూ.10 లక్షల కోట్ల అప్పుల ఊబిలో ముంచేసి విధ్వంస పాలన చేసిందన్నారు. ఈ విపత్కార పరిస్థితిని అధిగమించేందుకు కూటమి ప్రభుత్వం పెట్టుబడి సంస్థలను రప్పించి రాష్ట్రాన్ని గాడిలో పెడుతున్నదన్నారు. ఇంట్లో చదువుకున్న పిల్లలందరికీ అమ్మ ఒడి ఇస్తామని చెప్పి, ఒక్కరికే ఇచ్చి ప్రజలను వైసీపీ మోసం చేసిందన్నారు. టీడీపీ మాత్రం ఎన్నికల హామీ మేరకు తల్లికి వందనం పథకం ద్వారా ఎంతమంది పిల్లలు ఉంటే అందరికీ తల్లుల ఖాతాల్లో నగదు జమ చేసినట్టు చెప్పారు. 21 రోజుల్లో రైతులకు ధాన్యం కొనుగోలు చేసిన నగదు అందిస్తామని వైసీపీ నమ్మ బలికి మోసం చేస్తే, చంద్రబాబు అధికారంలోకి వచ్చాక రైతులకు బాకాయి ఉన్న రూ.1635 కోట్లు చెల్లించారని మంత్రి పార్థసారథి చెప్పారు. వైసీపీ ప్రభుత్వంలో పేద ప్రజల రక్తాన్ని దోచుకునేలా గంజాయి కేంద్రంగా రాష్ట్రాన్ని మార్చారని ఆయన ఆరోపించారు. ఈ ఏడాది డీసీసీబీ ద్వారా రూ.1400 కోట్ల రుణాలు అందించేందుకు సీఎం చంద్రబాబునాయుడు చర్యలు తీసుకున్నారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన 13 నెలల్లోనే హామీలను నెరవేర్చడంతో పాటు రాష్ట్రాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసే విధంగా అడుగులు వేస్తుంటే, వైసీపీ నేత బొత్స సత్యన్నారాయణ రప రపా నరుకుతా, కోస్తాం అనే పదజాలంతో మాట్లాడి ప్రజలకు పక్కదారి పట్టిస్తున్నారన్నారు. డీసీసీబీ పర్సన్ ఇన్‌చార్జి కోన తాతారావు మాట్లాడుతూ కేంద్ర సహకార బ్యాంకు ద్వారా తక్కువ వడ్డీకే రుణాలు అందిస్తున్నామన్నారు. అలాగే ఇళ్ల నిర్మాణాలతో పాటు వ్యవసాయానికి రుణాలు ఇస్తున్నామని చెప్పారు. ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు మాడుగుల నియోజకవర్గ పరిస్థితులను మంత్రికి వివరించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు ఏసుదాసు, ఏఎంసీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు, పార్టీ మండల అధ్యక్ష, కార్యదర్శులు అద్దెపల్లి జగ్గారావు, ఉండూరు దేముడు, డీసీసీబీ సీఈవో డీవీఎస్ వర్మ, అధిరారులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అంతకుముందు మంత్రి పార్థసారథి మోదకొండమ్మ ఆలయానికి వెళ్లి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సాదరంగా ఆహ్వానించి పూజా కార్యక్రమాలు చేశారు. అనంతరం మంత్రిని శాలువాతో సత్కరించి, అమ్మవారి జ్ఞాపికను అందించారు.

మాడుగుల సంతలో పైనాపిల్ ధర పతనం

- గత వారం ఒక్కో పండు రూ.14
- ఈ వారం రూ.4కు పడిపోయిన ధర
- నిరాశతో వెనుదిరిగిన గిరిజన రైతులు



మాడుగుల సోమవారం వారపు సంతకు వచ్చిన పైనాపిల్

మాడుగుల, జూలై 7 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో సోమవారం జరిగిన వారపు సంతలో పైనాపిల్ ధర పతనమైంది. గత వారం ఒక్కో పైనాపిల్ రూ.14కు అమ్ముడుపోగా, ఈ వారం ఒక్కసారిగా రూ.4కు పడిపోయింది. పాడేరు ఏజెన్సీలోని దేవాపురం, సలుగు, కందులపాలెం, ఈదులపాలెం, వంట్లమామిడి, కక్కి తదితర ప్రాంతాల నుంచి ఇక్కడి సంతలో విక్రయించేందుకు అధిక సంఖ్యలో పైనాపిల్, పనసపండ్లను తీసుకువచ్చారు. పండ్లు అధికంగా వచ్చాయని గమనించిన వ్యాపారులు, వాటిని కొనుగోలు చేసేందుకు ఆలస్యం చేశారు.

వారపు సంత చివరి దశకు వచ్చే సమయానికి పైనాపిల్ ధర భాగా తగ్గిపోతుందని భావించారు. దీంతో సంత ప్రారంభంలో వచ్చిన కొంత మంది వ్యాపారులు ఒక్కో పైనాపిల్ రూ.10 చొప్పున కొనుగోలు చేశారు. అయినప్పటికీ 11 గంటల వరకు పైనాపిల్ ఉండిపోయాయి. ఈ క్రమంలో సిండికేటుగా మారిన పలువురు వ్యాపారులు, ఒక్కో పండు రూ.4కి మించి కొనుగోలు చేయలేదు. దీంతో గిరిజన రైతులు పండ్లను తిరిగి తీసుకువెళ్లలేక, ఇక్కడ నిల్వ ఉంచేందుకు అవకాశం లేక వ్యాపారులు నిర్ణయించిన ధరకే విక్రయించి నిరాశతో వెనుతిరిగారు. సుమారు 30 కిలోమీటర్ల దూరం నుంచి పండ్లను మోసుకుని వచ్చామని, ధర అధికంగా పలుకుతుందని ఆశించామని, చివరకు రవాణా ఖర్చులు కూడా రాలేదని రైతులు ఆవేదన వక్తం చేశారు. కోల్డ్ స్టోరేజీలు ఏర్పాటుకు ప్రజాప్రతినిధులు, అధికారులు చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా వారు కోరారు.

పురాతన భవనంలో బిక్కుబిక్కుమంటూ విధులు

... 5వ పేజీ తరువాయి

లేవు. ఇప్పటికీ పురాతన చెక్క బీరువాలే వాడుతున్నారు. బ్రిటీష్ కాలం నాటి పాడైన చెక్క కుర్చీలు, టేబుళ్ల వినియోగిస్తున్నారు. నర్సీపట్నం ఏఈ ఆఫీసు గది మరీ అధ్వానంగా ఉంది. వర్షం పడితే పైకప్పు నీరు లీకై మడుగులా తయారవుతోంది. ఫైళ్లు తడవకుండా వాటిపై ప్లాస్టిక్ కవర్లు కప్పుతున్నారు. వర్షాకాలంలో అన్ని గదులు, వరండాల్లో నీరు లీకేజీ సమస్య ఉంది. కార్యాలయానికి తూర్పు భాగంలో ప్రహరీ గోడ పడిపోవడంతో చీకటి పడితే ఈ ఆవరణ మందుబాబులకు అడ్డాగా మారిపోతోంది.

ప్రతిపాదనలు పంపినా ఫలితం శూన్యం

ఆర్అండ్‌బీ కార్యాలయ భవనం మరమ్మతులకు రూ.35 లక్షలతో ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపారు. పాత గోడలు అలాగే ఉంచి పైకప్పు మొత్తం మార్చడానికి ప్రణాళిక చేశారు. అన్ని గదులకు సీలింగ్‌లు, మరుగుదొడ్లు, నీటి సరఫరా, ఎలక్ట్రికల్, ఫర్నిచర్ ఏర్పాటు చేయడానికి అంచనాలు తయారు చేశారు. ప్రతిపాదనలు పంపి ఆరు నెలలుగా కావస్తున్నా ఉన్నతాధికారులు స్పందించలేదు. దీంతో కార్యాలయంలో అధికారులు, సిబ్బందికి అవస్థలు తప్పడం లేదు.

క్రైం... crime news

భవనంపై నుంచి పడి యువకుడి దుర్మరణం



మహాలక్ష్మినాయుడు (ఫైల్ ఫొటో)

పరవాడ, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ఫంక్షన్ హాలు పై నుంచి ప్రమాదవశాత్తు కిందకు పడడంతో ఓ యువకుడు దుర్మరణం పాలయ్యాడు. సింహాద్రి ఎన్టీపీసీకి చెందిన దీపాంజలినగర్ టౌన్ షిప్‌లో ఆదివారం సాయంత్రం జరిగిన ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. మునగపాక మండలం టి.సిరసపల్లి గ్రామానికి చెందిన మద్దాల నాగసూరి మహాలక్ష్మినాయుడు (28)తో పాటు మరో ఇద్దరు శుభకార్యాలకు లైటింగ్ పనులు చేస్తుంటారు. ఈ క్రమంలో ఎన్టీపీసీ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా దీపాంజలినగర్ టౌన్‌షిప్‌లో ఓ ఫంక్షన్ హాల్‌కు లైటింగ్ పనులు చేపడుతున్నారు. వీరిలో మహాలక్ష్మినాయుడు మొదటి అంతస్థు పై నుంచి లైట్లు కడుతుండగా ప్రమాదవశాత్తూ కాలు జారి కిందకు పడిపోవడంతో గాయపడ్డాడు. వెంటనే సింహాద్రి ఎన్టీపీసీ ఆస్పత్రిలో చేర్చగా, ప్రథమ చికిత్స అనంతరం అనకాపల్లిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో కేజీహెచ్‌లో చేర్పించగా, అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం అర్ధరాత్రి మృతి చెందాడు. మహాలక్ష్మినాయుడుకు తల్లిదండ్రులతో పాటు ఇద్దరు అక్కలు ఉన్నారు. పరవాడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పురుగుల మందు తాగి ఒకరి ఆత్మహత్య



మృతి చెందిన పీతల వరాహాలు

కోటవురట్ల, జూలై 7 (ఆంధ్రజ్యోతి): భార్య మందలించిందన్న మన స్థాపంతో ఓ వ్యక్తి పురుగుల మందు తాగి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రాజుపేట పంచాయతీ శివారు పి.రామన్నపాలెం గ్రామానికి చెందిన పీతల వరహాలు (42) గొర్రెలు పెంచుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల మద్యానికి తరచూ మద్యం తాగుతుండడంతో భార్యతో గొడవులు జరుగుతున్నాయి. తాగుడు కోసం గొర్రెలను తక్కువ ధర ఎందుకు అమ్ముతున్నావని ఆదివారం రాత్రి భార్య నిలదీసింది. దీంతో వరహాలు మనస్థాపం చెంది సోమవారం పురుగుల మందు తాగి మేకల దొడ్డిలో అపస్మారక స్థితిలో పడిపోయాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు వరహాలను వెంటనే ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్చారు. పరిస్థితి విషమించడంతో నర్సీపట్నం ఆస్పత్రికి తరలిస్తుండగా దారిలోనే మృతి చెందాడు. అతని భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ రమేశ్ తెలిపారు.

రైలు ఢీకొని అల్లూరి జిల్లా వాసి మృతి



నూకరాజు (ఫైల్ ఫొటో)

పాయకరావుపేట, జూలై 7 (ఆంధ్రజ్యోతి): పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతి చెందినట్టు జీఆర్పీ ఎస్ఐ జి.శ్రీనివాసరావు తెలిపారు. అల్లూరి జిల్లా జి.మాడుగుల మండలం కిమ్ముడుపల్లి గ్రామానికి చెందిన బోనంగి నూకరాజు (50) ఆదివారం రాత్రి తన భార్యతో ఏలూరులో బంధువుల ఇంటికి రైలులో వెళ్లడానికి స్టేషన్‌కు వచ్చారన్నారు. రైల్వే స్టేషన్‌లో రెండో ప్లాట్‌ఫారం నుంచి పట్టాలు దాటి వచ్చి, ఒకటో ప్లాట్‌ఫారం పైకి ఎక్కుతుండగా విశాఖ నుంచి రాజమండ్రి వైపు వెళ్లే రైలు ఢీకొట్టడంతో నూకరాజు అక్కడికక్కడే మృతి చెందినట్టు చెప్పారు. ఈ సమయంలో రైలు రావడం చూసి అతని భార్య వెనక్కి వెళ్లిపోవడంతో ప్రమాదం తప్పిందన్నారు. మృతుడికి భార్య, కుమారుడు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలియజేశారు

గంజాయి రవాణా కేసులో ఇద్దరికి జైలు

విశాఖపట్నం/నాతవరం, జూలై 7 (ఆంధ్రజ్యోతి): గంజాయి రవాణా చేసిన ఇద్దరు ముద్దాయిలకు ఒక్కొక్కరికి పదేళ్ల జైలు, రూ2 లక్షల చొప్పున జరిమానా విధిస్తూ ప్రధానమెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి ఎం.వెంకటరమణ సోమవారం తీర్పు చెప్పారు. జరిమానా చెల్లించకుంటే అదనంగా ఆరు నెలల సాధారణ జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుందని తీర్పులో పేర్కొన్నారు. ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ జీవీఎస్ఎస్ ప్రసాద్ అందించిన వివరాలిలా ఉన్నాయి. మధురవాడ దుర్గానగర్‌కు చెందిన షేక్‌మస్తాన్ వలీ (26), బుట్టవారిపాలేనికి చెందిన జి.మల్లేశ్వరరావు (25) 2016 మే 3న ఆటోలో 60 కిలోల గంజాయిని తరలిస్తూ నాతవరం పోలీస్‌స్టేషన్ పరిధి వెదురుపల్లి జంక్షన్ వద్ద పోలీసులకు పట్టుబడ్డారు. నాతవరం ఎస్ఐ అశోక్ కుమార్ కేసు నమోదు చేసి నిందితులను అరెస్టు చేశారు. దర్యాప్తు అనంతరం కోర్టులో చార్జిషీట్‌ను దాఖలు చేశారు. ముద్దాయిలపై నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

లారీ ఢీకొని ఆటో డ్రైవర్‌కు తీవ్ర గాయాలు

అనకాపల్లి టౌన్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిలోని జలగలమదుం జంక్షన్ వద్ద సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక ఆటో డ్రైవర్ తీవ్రంగా గాయపడినట్టు ట్రాఫిక్ ఎస్ఐ శేఖరం తెలిపారు. శంకరం గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ నీలకాయల మోహన్ స్వగ్రామం నుంచి అనకాపల్లి మీదుగా లంకెలపాలెం రోడ్డులో వెళ్తుండగా, జలగలమదుం జంక్షన్ వద్ద లారీ ఢీకొందని చెప్పారు. ఈ సంఘటనలో ఆటో డ్రైవర్ మోహన్ తీవ్రంగా గాయపడ్డారన్నారు. సమాచారం అందిన వెంటనే హుటాహుటిన వెళ్లి ఆటో డ్రైవర్‌ను ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించామని చెప్పారు. వైద్యుల సూచనల మేరకు క్షతగాత్రుడ్ని విశాఖ కేజీహెచ్‌కు తరలించామని, కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

బీఎన్ రోడ్డు దుస్థితిపై కోర్టులో కేసు

... 5వ పేజీ తరువాయి

చేసినట్టు తెలిపారు. ప్రజలకు ప్రభుత్వం కల్పించవలసిన ప్రాథమిక వసతుల కల్పనలో వైఫల్యం గుర్తించిన కోర్టు, దీనిని విచారణకు స్వీకరించి ఇందుకు బాధ్యులైన అధికారులకు నోటీసులు జారీ చేసినట్టు తెలిపారు.

కలెక్టర్ సహా ఏడుగురు అధికారులకు నోటీసులు

ఈ కేసులో జిల్లా కలెక్టర్, ఆర్‌డీవో, జిల్లా ఆర్ అండ్‌బీ ఎస్ఈ, ఈఈ, స్థానిక ఆర్ అండ్‌బీ ఏఈ, తహశీల్దార్, ఎంపీడీవోలకు కోర్టు నోటీసులు జారీ చేశారని, వారంతా ఈనెల 26న కోర్టు ముందు హాజరై వివరణ ఇవ్వాలని నోటీస్‌లలో ఆదేశించినట్టు న్యాయవాది తెలిపారు.

ఇప్పటికైనా అధికార యంత్రాంగం స్పందించాలి

-కాండ్రేగుల డేవిడ్, బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు, చోడవరం

చోడవరం, మాడుగుల రహదారుల దుస్థితిపై తాము వేసిన కేసు విచారణకు స్వీకరించి నోటీసులు జారీచేయడం చాలా మంచి పరిణామమని, ఇప్పటికైనా అధికార యంత్రాంగం స్పందించి స్పష్టమైన ప్రణాళికతో కోర్టుకు వివరణ ఇస్తే ఈ ప్రాంత ప్రజానీకానికి మేలు జరిగే అవకాశం ఉందన్నారు. ఎంతోకాలంగా ప్రజలు పడుతున్న కష్టాలకు పరిష్కారం దొరికినట్టవుతుందన్నారు. ఈ విలేకరుల సమావేశంలో న్యాయవాదులు భరత్‌భూషణ్, భూపతిరాజులు పాల్గొన్నారు. కాగా బీఎన్ రోడ్డు దుస్థితిపై తరచూ 'ఆంధ్రజ్యోతి'లో కథనాలు ప్రచురిస్తున్న సంగతి తెలిసిందే. ఈ రోడ్డు విషయంలో ఆర్ అండ్‌బీ అధికారులు సైతం ప్రేక్షకుల మాదిరిగానే వ్యవహరిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే జిల్లా కలెక్టర్ సహా ఆర్అండ్‌బీ ఉన్నతాధికారులకు కోర్టు నోటీసులు జారీకావడం ఈ ప్రాంతంలో చర్చనీయాంశంగా మారింది.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	78.00
లైవ్ ధర	98.00
విత్ స్కిన్	166.00
స్కిన్ లెస్	176.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	560
విజయనగరం	564
శ్రీకాకుళం	564